

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 36 | హైదరాబాద్ | ఆదివారం | 26-07-2026 | పేజీలు: 08


## తెలంగాణ కాంగ్రెస్‌లో తుంగతుర్తి చిచ్చు


పీసీసీ చీఫ్‌కు జగ్గారెడ్డి నివేదిక
అధిష్ఠానం చర్యలపై ఉత్కంఠ
మళ్లీ మొదటికి వచ్చిన పంచాయితీ
నాయకుల మధ్య భగ్గుమన్న విభేదాలు
కోమటిరెడ్డి సోదరుల
వర్సెస్ ఎమ్మెల్యే సామేల్
తీవ్ర వ్యాఖ్యలతో రాజుకున్న
రాజకీయ దుమారం



02

## త్యాగం కాదు.. విద్యార్థుల రక్షణే ముఖ్యం

మంత్రి రాజీనామా కంటే విద్యార్థులపై
కేసులు పడకూడదనేదే ప్రాధాన్యం
అందుకే నిరాహార దీక్ష విరమించానన్న వాంగ్ చుక్
రాజీనామా కోసం కేంద్రంపై ఒత్తిడి కొనసాగుతుందని స్పష్టం
"డీల్ చేసుకుని దీక్ష విరమించలేదు" అంటూ విమర్శలకు కౌంటర్
శాంతియుత నిరసనకారులపై
కేసులు పెట్టబోమని కేంద్రం లిఖితపూర్వక హామీ
పరీక్షల సంస్కరణలపై పార్లమెంట్‌లో చర్చకూ అంగీకారం
* నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న
విద్యార్థుల కుటుంబాలకు పరిహారం పరిశీలన



02

## విద్యార్థులకు క్షమాపణ చెప్పండి

ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ డిమాండ్
విద్యార్థుల పోరాటానికి రాహుల్ గాంధీ మద్దతు
విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్
సీజేపీ మూడు డిమాండ్లు నెరవేర్చాలని విజ్ఞప్తి
పోరాటం ఆగదని ప్రతిపక్ష నేత హెచ్చరిక
స్వగృహంలో విద్యార్థులతో సమావేశం
సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్న రాహుల్



02

### అమెరికా సెనేట్‌లో
## సంచలన బిల్లు

మూడేళ్ల పాటు హెచ్-1బీ వీసాల
జారీ నిలిపివేతకు ప్రతిపాదన!
అమెరికా సెనేట్‌లో కొత్త బిల్లు
ప్రవేశపెట్టిన రిపబ్లికన్ సెనేటర్
హెచ్-1బీ వ్యవస్థలో భారీ
మార్పులకు శ్రీకారం
మూడేళ్ల పాటు కొత్త వీసాల
జారీపై తాత్కాలిక నిషేధం
అమెరికన్ కార్మికుల
ప్రయోజనాల రక్షణే ధ్యేయం
లక్ష డాలర్ల ఫీజును
శాశ్వతం చేసేలా ప్రతిపాదన
న్యాయపరమైన వివాదాల
నడుమ కఠిన నిర్ణయం

**సెనేట్, (ప్రజాక్షేత్రం):**

అమెరికాలోని విదేశీ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ ఐటీ రంగానికి ఊహించని షాక్ తగిలింది. హెచ్ 1బీ వీసాల జారీ విధానంలో భారీ మార్పులు తీసుకువస్తూ అమెరికా సెనేట్‌లో ఒక కీలకమైన మిగతా 2లో..




### ధర్మేంద్ర ప్రధాన్
# రాజీనామా!

ప్రధాని నరేంద్ర మోదీకి పంపిన రాజీనామా లేఖ
సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా వెల్లడించిన మంత్రి
కేంద్రంతో 'కాక్రోచ్ జనతా పార్టీ'
మూడో విడత చర్చల వేళ కీలక పరిణామం
గత నెల రోజులుగా జంతర్ మంతర్
వద్ద విద్యార్థుల నిరసనలు
ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే
ప్రధాన డిమాండ్‌గా ఉద్యమం
మంత్రి తొలగింపుపై మొండికేసిన సీజేపీ
ఆందోళనకారుల ప్రధాన
డిమాండ్లకు ఓకే చెప్పిన కేంద్రం
కేసుల ఉపసంహరణ, ఆత్మహత్య
చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం
యువత కలలను నెరవేర్చడమే
తమ లక్ష్యమన్న ధర్మేంద్ర ప్రధాన్



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

దేశ రాజధానిలో విద్యార్థుల ఆందోళనల నడుమ ఒక ఊహించని కేంద్ర రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. దేశ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి పంపించారు.

కేంద్ర ప్రభుత్వానికి, 'కాక్రోచ్ జనతా పార్టీ' (CJP)కి మధ్య మూడో విడత చర్చలు జరగడానికి కొన్ని గంటల ముందే ధర్మేంద్ర ప్రధాన్ తన రాజీనామా విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా అధికారికంగా ప్రకటించారు. గత నెల రోజులకు పైగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన భారీ నిరసనలకు మిగతా 2లో..

## మోదీకి మరో ప్రపంచ రికార్డు

24 గంటల్లో 10 లక్షల కొత్త ఇన్‌స్టా ఫాలోవర్లు
30.3 కోట్ల వ్యూస్‌తో ప్రపంచ రికార్డు
ఫిఫా ఫైనల్‌పై ఐషో స్పీడ్ వీడియో రికార్డు బద్దలు
జెన్-జీ స్టైల్ వీడియోకు యువత నుంచి భారీ స్పందన
స్పందించిన విద్యార్థులకు మరో వీడియోతో ధన్యవాదాలు
సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలని మంత్రులకు మోదీ సూచన



**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు. నీట్-2026 ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో విద్యార్థులను ఉద్దేశించి జెన్‌జీ శైలిలో అర్ధరాత్రి విడుదల చేసిన సెల్ఫీ వీడియో ప్రపంచవ్యాప్తంగా భారీ స్పందన దక్కించుకుంది. ఈ వీడియోతో కేవలం 24 గంటల్లోనే మోదీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు దాదాపు 10 లక్షల మంది కొత్త ఫాలోవర్లు చేరగా, అదే సమయంలో వీడియోకు 303 మిలియన్ల (30.3 కోట్ల) వీక్షణలు నమోదయ్యాయి. దీంతో 2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ సందర్భంగా ఐషో స్పీడ్ విడుదల చేసిన వీడియో పేరిట ఉన్న 300 మిలియన్ల వ్యూస్ రికార్డును అధిగమించినట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో 100 మిలియన్లకు పైగా (10.2 కోట్లకు పైగా) మిగతా 2లో..

### రియల్ ఎస్టేట్‌లో
## రికార్డు స్థాయి వృద్ధి

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయిందనేది గోబెల్స్ ప్రచారం
వివరాలతో సహా కొట్టిపారేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందనే ప్రచారంలో నిజం లేదు
-నగరంలో ప్లాట్ల విక్రయాలు 40 శాతం పెరిగాయని వెల్లడి
హైదరాబాద్ అభివృద్ధికే ప్రపంచ పారిశ్రామికవేత్తల మొగ్గు
దావోస్ పర్యటన అనుభవాలను పంచుకున్న మంత్రి

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతిన్నదంటూ కొంతమంది కావాలని గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. శనివారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రిగా తన వద్ద స్పష్టమైన ఆధారాలు, రిజిస్ట్రేషన్ గణాంకాలు ఉన్నాయని, ఇలాంటి దుష్ప్రచారాలను ప్రజలు, మిగతా 3లో..



# అస్సాంను ముంచెత్తిన వరదలు

మృతుల సంఖ్య 62కు పెరుగుదల
12 జిల్లాల్లో 7 లక్షల మందిపై ప్రభావం
856 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కు
56 వేల హెక్టార్లకు పైగా పంటలు నీటమునక
సహాయక శిబిరాల్లో 1.15 లక్షల మంది ఆశ్రయం
ప్రమాద స్థాయికి మించి నాలుగు నదుల ప్రవాహం
యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు

**అస్సాం, (ప్రజాక్షేత్రం):**

అస్సాంలో వరదల తీవ్రత మరింత పెరిగింది. తాజాగా మరో 14 మంది ప్రాణాలు కోల్పోవడంతో వరదలకు సంబంధించిన మృతుల సంఖ్య 62కు చేరింది. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 7,05,148 మంది వరదల ప్రభావానికి గురికాగా, 856 గ్రామాలు నీట మునిగిపోయాయి. సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. విపత్తు నివేదికల ప్రకారం, తాజా మరణాల్లో చరైదియో జిల్లాలో ఏడుగురు, శివసాగర్‌లో ఆరుగురు, జోర్హాట్‌లో మిగతా 2లో..





## ఎల్‌నినో సవాళ్లకు మైక్రో ఇరిగేషనే పరిష్కారం

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ (సూక్ష్మ సాగునీటి) కంపెనీల ప్రతినిధులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వల్ల ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కంపెనీలు రైతులకు పూర్తిస్థాయిలో అండగా నిలవాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి, నీటి కొరత ప్రభావం పంటలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఎల్‌నినో సవాళ్లను దాటుకుని రైతులకు మేలు చేయాలంటే డ్రిప్ (బిందు) మరియు తుంపర (స్ప్రింక్లర్) సేద్య విధానాలే ఏకైక పరిష్కార మార్గాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న డ్రిప్ సిస్టమ్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో మైక్రో ఇరిగేషన్ మిగతా 3లో..

మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో
మంత్రి తుమ్మల భేటీ
రైతులకు అండగా
నిలవాలని మంత్రి పిలుపు
డ్రిప్, తుంపర సేద్యంతోనే
నీటి ఎద్దడికి చెక్
వేగవంతంగా పనులు
పూర్తి చేయాలని ఆదేశం
కార్యాచరణ ప్రణాళికల
రూపకల్పనపై దృష్టి
అనుమతుల మంజూరులో
జాప్యం ఉండొద్దని స్పష్టం

# అమెరికా సెనేట్‌లో సంచలన బిల్లు

మొదటిపేజీ తరువాయి

నూతన బిల్లు ప్రవేశపెట్టబడింది. మొంటానా రాష్ట్రానికి చెందిన రిపబ్లికన్ సెనేటర్ టిమ్ షీహీ ఈ బిల్లును సభ ముందుకు తీసుకువచ్చారు. దీనికి 'ఎండ్ హెచ్1బీ అబ్యూజ్ యాక్ట్' అని పేరు పెట్టారు. ప్రస్తుతం అమలులో ఉన్న వీసా విధానం తన అసలు లక్ష్యాల నుంచి పక్కదారి పట్టిందని, అందుకే ఈ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఈ కొత్త బిల్లులోని అత్యంత ప్రధానమైన ప్రతిపాదన ఏంటంటే, నూతన హెచ్1బీ వీసాల జారీని వరుసగా మూడేళ్ల పాటు పూర్తిగా నిలిపివేయడం. అమెరికా కంపెనీలు తక్కువ వేతనాలకే విదేశీ నిపుణులను నియమించుకుంటూ, స్థానిక అమెరికన్ కార్మికుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీస్తున్నాయనే విమర్శలు పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని ప్రతిపాదించారు. మూడేళ్ల విరామం తర్వాత, అత్యంత కఠినమైన నిబంధనలు, కచ్చితమైన పరిమితులతో మాత్రమే ఈ వీసా కార్యక్రమాన్ని తిరిగి పునరుద్ధరించాలని బిల్లులో పేర్కొన్నారు.

గతంలో డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ దరఖాస్తులపై ప్రతిపాదించిన ఒక లక్ష డాలర్ల భారీ ఫీజును చట్టబద్ధం చేసి, శాశ్వతంగా అమలు చేయాలని ఈ బిల్లు సూచిస్తోంది. అయితే ఈ ఫీజు విధానంపై ఇప్పటికే న్యాయస్థానాల్లో వివాదం నడుస్తోంది. కాంగ్రెస్ అనుమతి లేకుండా ఇటువంటి పన్ను తరహా ఫీజులను విధించే అధికారం ప్రభుత్వానికి లేదని బోస్టన్‌లోని అప్పీల్స్ కోర్టు ఇటీవలే తీర్పు ఇచ్చింది. ట్రంప్ యంత్రాంగం వేసిన స్టే పిటిషన్‌ను కూడా కోర్టు తిరస్కరించినప్పటికీ, ఈ బిల్లు ద్వారా ఆ ఫీజుకు చట్టభద్రత కల్పించాలని రిపబ్లికన్ సెనేటర్ యత్నిస్తున్నారు.

ప్రస్తుతం హెచ్1బీ వీసాల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ర్యాండమ్ లాటరీ పద్ధతిని పూర్తిగా రద్దు చేయాలని బిల్లు ప్రతిపాదించింది. దీనికి బదులుగా, ఉద్యోగులకు కంపెనీలు ఇచ్చే వేతనాల ఆధారంగా వీసాలను కేటాయించే నూతన విధానాన్ని తీసుకురావాలని సూచించారు. అత్యధిక జీతాలు చెల్లించే ఉన్నత స్థాయి ఉద్యోగాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, దీనివల్ల తక్కువ వేతనాలతో విదేశీయులను అమెరికాకు తీసుకురావడం సాధ్యపడదని భావిస్తున్నారు.

ఐటీ రంగంలో విస్తృతంగా ఉన్న థర్డ్ పార్టీ స్టాఫింగ్ ఏజెన్సీలు లేదా కన్సల్టెన్సీల ద్వారా హెచ్1బీ ఉద్యోగులను నియమించుకునే ప్రక్రియను పూర్తిగా నిషేధించాలని బిల్లులో పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి నేరుగా సదరు కంపెనీ రోల్స్‌పైనే పనిచేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా, హెచ్1బీ వీసాదారులకు ఉన్న ఒకేసారి రెండు ఉద్యోగాలు (మల్టిపుల్ ఎంప్లాయ్‌మెంట్) చేసే వెసులుబాటును కూడా రద్దు చేయాలని ప్రతిపాదించారు.

హెచ్1బీ వీసాదారులకు ఎంతో లబ్ధి చేకూర్చే 'డ్యూయల్ ఇంటెంట్' విధానాన్ని రద్దు చేయాలని ఈ బిల్లు సూచిస్తోంది. అంటే, హెచ్1బీ వీసాతో అమెరికాలో ఉంటూనే శాశ్వత నివాస హోదా (గ్రీన్ కార్డ్) కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాలను పరిమితం చేయాలని చూస్తున్నారు. ఇది అమలులోకి వస్తే, వీసా ఉన్నప్పటికీ అమెరికాలో శాశ్వతంగా స్థిరపడాలనుకునే భారతీయ నిపుణుల ఆశలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అలాగే కుటుంబ సభ్యులను అమెరికాకు తీసుకువచ్చే నిబంధనలపై కూడా కఠినత్వాలు రానున్నాయి. అమెరికాలో చదువు పూర్తిచేసుకున్న విదేశీ విద్యార్థులకు తాత్కాలికంగా ఉద్యోగాలు చేసుకునేందుకు తోడ్పడే 'ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్' వంటి కార్యక్రమాలను కూడా రద్దు చేయాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. దీంతో పాటు, అమెరికా ప్రభుత్వ సంస్థలు ఎలాంటి విదేశీ నాన్‌ఇమిగ్రెంట్ వీసాదారులను ఉద్యోగాల్లోకి తీసుకోకుండా నిషేధించాలని పేర్కొంది. ఈ కఠినమైన ప్రతిపాదనలకు ఇమ్మిగ్రేషన్ అకౌంటబిలిటీ ప్రాజెక్ట్, ఫెడరేషన్ ఫర్ అమెరికన్ ఇమ్మిగ్రేషన్ రిఫార్మ్ వంటి సంస్థలు మద్దతు తెలిపాయి.

ఈ నూతన బిల్లు ప్రతిపాదనలు వెలువడటంతో అమెరికాలోని ఐటీ వర్గాలు, ముఖ్యంగా భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రతి ఏటా హెచ్1బీ వీసాల్లో సింహభాగం దక్కించుకుంటున్న భారతీయులపై ఈ నిబంధనలు నేరుగా దెబ్బకొట్టనున్నాయి. అమెరికాలో ఉద్యోగావకాశాలు సంపాదించడం, అక్కడే సుదీర్ఘకాలం కొనసాగడం రాబోయే రోజుల్లో మరింత క్లిష్టంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మోదీకి మరో ప్రపంచ రికార్డు

మొదటిపేజీ తరువాయి

ఫాలోవర్లతో ప్రపంచంలోనే అత్యధిక మంది అనుసరించే గ్లోబల్ రాజకీయ నాయకుడిగా మోదీ కొనసాగుతున్నారు. "ఫ్రెండ్స్..." అంటూ ప్రారంభమైన ఆయన జెన్‌జీ శైలి ప్రసంగం యువతను విశేషంగా ఆకట్టుకోవడంతో, అదే శైలిని అనుకరిస్తూ వేలాది రీల్స్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా జెన్‌జీ తరాన్ని దృష్టిలో పెట్టుకుని మోదీ అనుసరించిన ఈ కొత్త కమ్యూనికేషన్ విధానం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

ప్రశ్నపత్రాల లీక్‌లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరిస్తూ విడుదల చేసిన వీడియోకు విద్యార్థుల నుంచి విశేష స్పందన రావడంపై ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. వారికి ధన్యవాదాలు తెలుపుతూ మరో వీడియోను కూడా విడుదల చేశారు.

ఇదిలా ఉండగా, కేంద్ర మంత్రులు అందరూ సోషల్ మీడియాలో మరింత చురుకుగా ఉండాలని, యువతతో నేరుగా మమేకమవుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఇటీవల జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధాని మోదీ సూచించినట్లు సమాచారం.

# అస్సాంను ముంచెత్తిన వరదలు

మొదటిపేజీ తరువాయి



ఒకరు మృతి చెందారు. శివసాగర్ జిల్లా అత్యధికంగా 3,48,555 మంది బాధితులతో అత్యంత తీవ్రంగా ప్రభావితమైంది. ఆ తర్వాత చరైదియోలో 1,88,404 మంది, జోర్హాట్‌లో 1,26,793 మంది వరదలతో ఇబ్బందులు పడుతున్నారు.

గోలాఘాట్, చరైదియో, దిబ్రూగఢ్, హోజై, నగావ్, బిశ్వనాథ్, జోర్హాట్, ధేమాజీ, శివసాగర్, సోనిత్‌పూర్, కామ్రూప్ (మెట్రో), కార్బీ ఆంగ్‌లాంగ్ జిల్లాలు ప్రస్తుతం వరదల ప్రభావంలో ఉన్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా 363 సహాయక శిబిరాలు, సహాయ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 1,15,205 మంది ఆశ్రయం పొందుతుండగా, మరో రెండు లక్షల మందికి పైగా బాధితులకు సహాయ సామగ్రి అందిస్తున్నారు. డిఖౌ, దిసాంగ్, ధన్‌సిరి (దక్షిణ), కుషియారా నదులు ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి.

వ్యవసాయ రంగం కూడా తీవ్రంగా దెబ్బతింది. మొత్తం 56,606 హెక్టార్లకు పైగా పంట భూములు వరద నీటిలో మునిగిపోయాయి. గత 24 గంటల్లో 17,107 పశువులు, కోళ్లు వరదలో కొట్టుకుపోగా, మొత్తం 3.34 లక్షల పశువులు, పక్షులు వరదల ప్రభావానికి గురయ్యాయి.

జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్), సైన్యం, వైమానిక దళం, స్థానిక యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. శుక్రవారం ఒక్కరోజే దాదాపు వెయ్యి మందిని వరద ముంపు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఇదిలా ఉండగా, వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందన్నారు. నాగాలాండ్‌లోని మోన్, మోకోక్‌చుంగ్, వోఖా జిల్లాలతో పాటు అస్సాంలో కురిసిన భారీ వర్షాల కారణంగానే చరైదియో, శివసాగర్ జిల్లాల్లో విస్తృతంగా వరదలు సంభవించాయని, పరిస్థితి ఇంకా తీవ్రంగానే ఉందని ఆయన తెలిపారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో తుంగతుర్తి చిచ్చు

- పీసీసీ చీఫ్‌కు జగ్గారెడ్డి నివేదిక
- అధిష్ఠానం చర్యలపై ఉత్కంఠ
- మళ్లీ మొదటికి వచ్చిన పంచాయితీ
- నాయకుల మధ్య భగ్గుమన్న విభేదాలు
- కోమటిరెడ్డి సోదరుల వర్సెస్ ఎమ్మెల్యే సామేల్
- తీవ్ర వ్యాఖ్యలతో రాజుకున్న రాజకీయ దుమారం

**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ వివాదం తీవ్ర కలకలం రేపుతోంది. గత కొన్ని రోజులుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు ఇప్పుడు బహిర్గతమై, పార్టీ శ్రేణుల్లో పెద్ద అలజడికి దారితీసింది. పాత, కొత్త నాయకుల మధ్య ఆధిపత్య పోరు పెరగడంతో తుంగతుర్తి కాంగ్రెస్ వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. స్థానిక నాయకుల మధ్య విభేదాలు కాస్తా పార్టీలోని అగ్రనేతల మధ్య మాటల యుద్ధానికి కారణమయ్యాయి.

కోమటిరెడ్డి సోదరులను లక్ష్యంగా చేసుకుని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. "ఎస్సీ నియోజకవర్గమైన తుంగతుర్తిపై మీ ఆధిపత్యం ఏంటి? కాంగ్రెస్ పార్టీ ఏమైనా మీ సొంత జాగీరా?" అని సామేల్ ఘాటుగా ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై ఎమ్మెల్యేకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంతే తీవ్ర స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. సామేల్‌కు పార్టీ టికెట్ ఇప్పించి, అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించింది తానేనని ఆయన గుర్తుచేశారు. ఈ ఇద్దరు నేతల మధ్య నడిచిన సవాళ్లు, ప్రతిసవాళ్లతో తుంగతుర్తి రాజకీయం మరింత వేడెక్కింది. ఇటీవల తుంగతుర్తి నియోజకవర్గంలో నిర్వహించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం పార్టీలో తీవ్ర చిచ్చు రేపింది. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ వర్గం ఒకవైపు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు పాత కాంగ్రెస్ నేతల వర్గం మరొకవైపు చేరి తీవ్రస్థాయిలో ఘర్షణకు దిగాయి. ఇరువర్గాల మధ్య విభేదాలు ముదిరి పరస్పరం కర్రలు, రాళ్లతో కొట్టుకునే వరకు పరిస్థితి దారితీసింది. దీంతో అధికార పార్టీ ప్రతిష్ట దెబ్బతింటోందని భావించిన అధిష్ఠానం వెంటనే రంగంలోకి దిగింది.

వివాదం తీవ్రరూపం దాల్చడంతో గొడవలను సర్దుబాటు చేసే బాధ్యతను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి అధిష్ఠానం అప్పగించింది. పార్టీ ఆదేశాల మేరకు పరిశీలకుడిగా రంగంలోకి దిగిన జగ్గారెడ్డి, దాదాపు పది రోజుల పాటు నియోజకవర్గ పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. గొడవలకు కారణమైన ఇరువర్గాల నాయకులతో, స్థానిక కార్యకర్తలతో వేర్వేరుగా సమావేశమై వారి అభిప్రాయాలను, ఫిర్యాదులను సుదీర్ఘంగా విని సమాచారాన్ని సేకరించారు. ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం జగ్గారెడ్డి తుంగతుర్తి ఘటనలపై 7 పేజీలతో ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. హైదరాబాదులోని గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు (టీపీసీసీ చీఫ్) మహేశ్ కుమార్ గౌడ్‌తో భేటీ అయి ఈ నివేదికను అందజేయనున్నారు. నియోజకవర్గంలో అసలు ఏం జరిగింది, ఘర్షణలకు దారితీసిన పరిస్థితులు ఏంటి, బాధ్యులెవరనే అంశాలను ఆ నివేదికలో స్పష్టంగా పొందుపరిచినట్లు తెలుస్తోంది.

ఈ నివేదిక సమర్పణకు ముందు ఓ వార్తా ఛానెల్‌తో మాట్లాడిన జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయంలో ఇవన్నీ తాను చూసిన అంశాలేనని, ఏ నాయకుడి బలం ఎంత, ఎవరి కెపాసిటీ ఏంటో తనకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. గొప్పలు చెప్పుకునే నాయకులను చాలా మందిని చూశానని, అలాంటివేవీ తన నివేదిక రూపకల్పనను ప్రభావితం చేయలేవని స్పష్టం చేశారు. ఎవరికో ఒకరికి సానుకూలంగా లేదా మరొకరికి వ్యతిరేకంగా నివేదిక ఇవ్వలేదని, పూర్తి నిష్పాక్షికంగా తయారు చేశానని చెప్పారు. పార్టీ నియమావళి ప్రకారం నియోజకవర్గంలో ప్రాధాన్యతలు ఎలా ఉంటాయో జగ్గారెడ్డి మరోసారి స్పష్టం చేశారు. "మొదటి ప్రాధాన్యత ఎప్పుడైనా స్థానిక ఎమ్మెల్యేకే ఉంటుంది. రెండో ప్రాధాన్యత ఎంపీకి, మూడో ప్రాధాన్యత పార్టీ కార్యకర్తల తరఫున డీసీసీ అధ్యక్షుడికి ఉంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీ నియమావళికి, అందరి అభిప్రాయాలకు అనుగుణంగానే ఈ నివేదికను రూపొందించానని, దీనిపై అధిష్ఠానమే తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. జగ్గారెడ్డి సమర్పించనున్న 7 పేజీల నివేదికలో ఏముందనే అంశంపై తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి రోడ్డున పడ్డ నాయకులపై పీసీసీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని నాయకులు ఎదురుచూస్తున్నారు. క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారా లేక ఇరువర్గాలను పిలిచి సర్దిచెబుతారా అనేది త్వరలోనే తేలనుంది. అధిష్ఠానం నిర్ణయంతోనైనా తుంగతుర్తి పంచాయితీకి పూర్తిస్థాయిలో తెరపడుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

# విద్యార్థులకు క్షమాపణ చెప్పండి

- ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ డిమాండ్
- విద్యార్థుల పోరాటానికి రాహుల్ గాంధీ మద్దతు
- విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్
- సీజేపీ మూడు డిమాండ్లు నెరవేర్చాలని విజ్ఞప్తి
- పోరాటం ఆగదని ప్రతిపక్ష నేత హెచ్చరిక
- స్వగృహంలో విద్యార్థులతో సమావేశం
- సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్న రాహుల్

**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపడుతున్న ఆందోళనలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రంగా స్పందించారు. విద్యార్థులు కోరుతున్న ప్రధానమైన మూడు డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నిరసనలకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపిన ఆయన, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అలక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యాశాఖ నిర్వహణలో విఫలమైన అసమర్థ మంత్రి రాజీనామా చేసేంత వరకు విద్యార్థుల ఉద్యమం ఆగేది లేదని స్పష్టం చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న పాలకులకు గుణపాఠం చెప్పేందుకే యువత రోడ్లపైకి వచ్చి పోరాడుతోందని వ్యాఖ్యానించారు.

శనివారం రోజున ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థుల ప్రతినిధులతో రాహుల్ గాంధీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి డిమాండ్లు మరియు నిరసనల వివరాలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. న్యాయం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పోలీసులు దారుణంగా దాడులకు పాల్పడుతున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న యువతపై బలప్రయోగం చేయడం దారుణమన్నారు. విద్యార్థులకు రక్షణగా నిలవాల్సిన ప్రభుత్వమే వారిపై దాడులు చేయించడం అణచివేత ధోరణికి నిదర్శనమని మండిపడ్డారు.


దేశంలో లక్షలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి ఆందోళన చేస్తుంటే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియోల ద్వారా నాటకాలు ఆడుతున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడాన్ని ఆపి, వారిని ఇబ్బందులకు గురిచేసినందుకు ప్రధాని మోదీ దేశ యువతకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవస్థలోని లోపాలను, అక్రమాలను ధైర్యంగా ప్రశ్నిస్తున్న విద్యార్థులను చూసి తాను ఎంతో గర్వపడుతున్నానని రాహుల్ గాంధీ అన్నారు. పోరాట బాట పట్టిన ఈ యువతరం భయపడే తరం కాదని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తని కొనియాడారు. ఎంతటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా హక్కుల కోసం నిలబడటం అభినందనీయమని చెప్పారు.

ప్రస్తుత విద్యా వ్యవస్థలో పేరుకుపోయిన లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వమంతా ఏకమై వచ్చినా, పోరాడుతున్న విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని కదిలించలేరని స్పష్టం చేశారు. విద్యార్థుల ఐక్యత ముందు ఏ ప్రభుత్వ అణచివేత చర్యలూ నిలబడవని రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ మరియు ప్రతిపక్షాలు పూర్తిస్థాయిలో అండగా ఉంటాయని రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. వారికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు ఈ ఉద్యమాన్ని పార్లమెంటు లోపల, వెలుపల కొనసాగిస్తామని చెప్పారు. ప్రభుత్వం దిగివచ్చి విద్యార్థుల డిమాండ్లను తీర్చే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత

**వలిగొండ జిల్లా 25(ప్రజాక్షేత్రం):**

భువనగిరి జిల్లా వలిగొండ పట్టణానికి చెందిన సోమన బోయిన వలయ మేస్త్రి చనిపోయారు. పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం మేస్త్రిలు వారి కుటుంబాన్ని పరామర్శిస్తూ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం తరఫున 20 వేలరూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సమావేశంలో కార్మికులందరూ మృతుడి కుటుంబానికి 5 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు మలగ బీరప్ప పోలేపాక శంకర్ మండల మాజీ అధ్యక్షులు సింగారం వెంకటయ్య పల్లెర్ల రాజు పట్టణ మాజీ అధ్యక్షులు మైసొల్ల నరసింహ బూడిద నరసింహ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ తుర్కపల్లి సురేందర్ మండల ప్రధాన కార్యదర్శి మొగిలి పాక ఎల్ల స్వామి చేవూరు నగేష్ తదితరులు పాల్గొన్నారు.



# త్యాగం కాదు.. విద్యార్థుల రక్షణే ముఖ్యం

- సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్
- మంత్రి రాజీనామా కంటే విద్యార్థులపై కేసులు పడకూడదనేదే ప్రాధాన్యం
- అందుకే నిరాహార దీక్ష విరమించానన్న వాంగ్ చుక్
- రాజీనామా కోసం కేంద్రంపై ఒత్తిడి కొనసాగుతుందని స్పష్టం
- "డీల్ చేసుకుని దీక్ష విరమించలేదు" అంటూ విమర్శలకు కౌంటర్
- శాంతియుత నిరసనకారులపై కేసులు పెట్టబోమని కేంద్రం లిఖితపూర్వక హామీ
- పరీక్షల సంస్కరణలపై పార్లమెంట్‌లో చర్చకూ అంగీకారం
- నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం పరిశీలన

**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండానే తన 26 రోజుల నిరవధిక నిరాహార దీక్షను విరమించడంపై వస్తున్న విమర్శలకు పర్యావరణ కార్యకర్త సోనం వాంగ్చుక్ స్పందించారు. మంత్రి రాజీనామా కంటే, ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, నిరసనకారులపై ఎలాంటి పోలీసు కేసులు నమోదు కాకుండా చూడటమే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. అందుకే చర్చల్లో రాజీనామా అంశాన్ని గట్టిగా పట్టుబట్టలేదని వెల్లడించారు. శుక్రవారం రాత్రి ఆస్పత్రి నుంచి విడుదల చేసిన 24 నిమిషాల వీడియోలో వాంగ్చుక్ ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు, పోటీ పరీక్షల్లో అక్రమాలపై చర్యలు, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి డిమాండ్లతో కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా జూన్ 28 నుంచి ఆయన నిరాహార దీక్ష చేస్తున్నారు. చర్చల అనంతరం కేంద్ర ప్రభుత్వం శాంతియుత నిరసనకారులపై ఎలాంటి కేసులు నమోదు చేయబోమని లిఖితపూర్వక హామీ ఇచ్చిందని, పరీక్షల సంస్కరణలు, పేపర్ లీక్‌లపై పార్లమెంట్‌లో విస్తృత చర్చ నిర్వహిస్తామని అంగీకరించిందని తెలిపారు. అలాగే నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అంశాన్ని కూడా సానుకూలంగా పరిశీలిస్తామని చెప్పిన తర్వాతే తాను దీక్ష విరమించినట్లు వివరించారు.

మంత్రి రాజీనామా తన డిమాండ్లలో ఒకటేనని, అయితే అది తన వ్యక్తిగత విజయంగా సాధించాల్సిన అంశం కాదన్నారు. "రాజీనామా ఇవ్వకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వానికే ప్రజల్లో తీవ్ర నష్టం జరుగుతోంది. చివరికి వారు ఆ నిర్ణయం తీసుకోవాల్సిందేనన్న నమ్మకం నాకు ఉంది. అందుకే నా దృష్టి విద్యార్థుల భద్రతపైనే నిలిచింది" అని వాంగ్చుక్ పేర్కొన్నారు. తాను కేంద్రంతో ఎలాంటి 'డీల్' చేసుకోలేదన్న ఆరోపణలను కూడా ఆయన ఖండించారు. "ఒకవేళ ఒప్పందం చేసుకోవాలనుకుంటే ఢిల్లీలో 26 రోజులు ఎండలో ఆకలితో ఎందుకు ఉండేవాడిని? ఎయిర్ కండిషన్ గదిలో కూర్చొని అదే పని చేసుకునేవాడిని" అని వ్యాఖ్యానించారు.

గతంలో లఢఖ్‌లో జరిగిన ఘటనలను గుర్తు చేసుకుంటూ, ఢిల్లీలోనూ నిరసనకారులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్న ఆందోళనతోనే తక్షణమే దీక్ష విరమించి శాంతికి పిలుపునిచ్చానని చెప్పారు. అయితే తనతో పాటు ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, ఎంపీలు, లఢఖ్ ప్రతినిధులు లేకుండానే దీక్ష విరమించాల్సి రావడం తనకు అత్యంత బాధ కలిగించిన విషయమని వాంగ్చుక్ ఆవేదన వ్యక్తం చేశారు.


# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా!

మొదటిపేజీ తరువాయి

ప్రధాన కారణం విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండే కావడం గమనార్హం. ఈ రాజీనామా అంశంపైనే ప్రభుత్వం, సీజేపీ నాయకుల మధ్య చర్చలు నిలిచిపోయాయి. శనివారం ఉదయం కూడా "ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుండి తొలగిస్తేనే తదుపరి చర్చలు ఉంటాయి, లేకపోతే లేవు" అని సీజేపీ స్పష్టం చేసింది. దాంతో ఏర్పడిన రాజ్యాంగ, రాజకీయ సంక్షోభాన్ని నివారించేందుకు మంత్రి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో, ఆందోళనకారులు ప్రతిపాదించిన అన్ని ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చినట్లయింది. విద్యార్థులు ప్రధానంగా మూడు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు:

1. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం,
2. ఆందోళనలు చేస్తున్న విద్యార్థులపై ఎలాంటి చట్టపరమైన కేసులు నమోదు చేయకపోవడం,
3. నీట్ (NEET) పేపర్ లీకేజీ కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం అందించడం.



శుక్రవారం నాటి చర్చల్లో చివరి రెండు డిమాండ్లకు అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం, మంత్రి రాజీనామాపై మాత్రం అప్పట్లో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. అయితే శనివారం నాటి పరిణామంతో ఆ డిమాండ్‌ను కూడా నెరవేర్చింది.

తన రాజీనామా ప్రకటనలో ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ — "ఈ దేశ యువత ఆశయాలు, సెంటిమెంట్లు మరియు వారి న్యాయమైన నిరీక్షణలను నేను ఎంతగానో గౌరవిస్తాను. భారతదేశపు యువత కలలను నెరవేర్చడమే నా రాజకీయ, సామాజిక జీవితానికి ఉన్న నైతిక బలం. ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి కలిగిన నాయకత్వంలో దేశానికి సేవ చేసే అవకాశం ఇచ్చినందుకు వారికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అని పేర్కొన్నారు.

# రియల్ ఎస్టేట్‌లో రికార్డు స్థాయి వృద్ధి

**మొదటిపేజీ తరువాయి**

బిల్డర్లు నమ్మాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు.

గడిచిన రెండున్నరేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనలో హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం 15 నుంచి 20 శాతం వృద్ధి సాధించిందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఓపెన్ ప్లాట్ల విక్రయాలు ఏకంగా 40 శాతం వరకు పెరిగాయని వివరించారు. గత పదేళ్ల కాలంతో పోలిస్తే ఈ రెండున్నరేళ్లలోనే రెసిడెన్షియల్ మార్కెట్ అద్భుతమైన ప్రగతిని నమోదు చేసిందని చెప్పారు. తమ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో రికార్డు స్థాయిలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని పొంగులేటి పేర్కొన్నారు. ప్రభుత్వంపై బురద చల్లేందుకు చేసే ప్రయత్నాలను ఆయన ఖండించారు.

2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రుల దూరదృష్టి వల్లే హైదరాబాద్ రోల్ మోడల్‌గా మారిందని మంత్రి గుర్తుచేశారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ సెక్టార్ వంటివి 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందడానికి నాటి దూరదృష్టితో కూడిన నిర్ణయాలే కారణమన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడు, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు సైతం హైదరాబాద్ నగరంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎంతో ఆసక్తి చూపించారని వెల్లడించారు. ప్రపంచస్థాయి పెట్టుబడులకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారిందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్ నగరాన్ని మరింత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. సుమారు రూ. 7,000 కోట్ల భారీ అంచనాతో చేపట్టనున్న మూసీ నది పునరుజ్జీవం, సుందరీకరణ ప్రాజెక్టు త్వరలోనే పట్టాలెక్కబోతోందని చెప్పారు. మొదటి విడత కింద 28 కిలోమీటర్ల మేర చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి రాబోయే వారం పది రోజుల్లోనే అధికారికంగా టెండర్లు పిలవబోతున్నామని మంత్రి సభకు వెల్లడించారు. నగరంలో రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు రెండో విడత మెట్రో రైలు విస్తరణ పనులను రూ. 24,000 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించనున్నట్లు మంత్రి ప్రకటించారు. పాతబస్తీతో పాటు నగరంలోని ఇతర కీలక ప్రాంతాలను కలుపుతూ మొత్తం 76 కిలోమీటర్ల మేర ఈ విస్తరణ కొనసాగుతుందన్నారు. దీంతో పాటు రీజనల్ రింగ్ రోడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానించేలా నూతన రేడియల్ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా చివరి దశలో ఉన్నాయని తెలిపారు.రాష్ట్రంలోని ప్రజల భూములకు పూర్తి భద్రత, భరోసా కల్పించే లక్ష్యంతో తమ ప్రభుత్వం 'భూభారతి' చట్టాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని పొంగులేటి తెలిపారు. ఈ చట్టానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో ఉన్న కొన్ని చిన్నచిన్న సాంకేతిక సమస్యలను మరో 15 నుంచి 20 రోజుల్లో పూర్తిగా సరిచేసి ప్రజలకు సులభతరమైన సేవలను అందిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరి ఆస్తికి కచ్చితమైన హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కేవలం వ్యాపార రంగానికే కాకుండా, పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తొలి విడత కింద లక్ష ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. దీని తర్వాత దఫదఫాలుగా మరిన్ని ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. పేదల గృహ నిర్మాణాల కోసం దాదాపు 2 నుంచి 3 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని సేకరించే ప్రక్రియలో ఉన్నామని మంత్రి వివరించారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోనే అత్యంత సుందర నగరంగా తీర్చిదిద్దడంలో రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజలకు నమ్మకంగా, నిర్దేశిత సమయంలోనే ప్లాట్లు, ఇళ్లను అందించి వారి విశ్వాసాన్ని గెలుచుకోవాలని సూచించారు. బిల్డర్లు, డెవలపర్ల అభ్యర్థన మేరకు రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన అనుమతులు వేగంగా వచ్చేలా 'ఫాస్ట్ ట్రాక్' విధానాన్ని కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ్‌రెడ్డి సహా పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# ఎల్-నినో సవాళ్లకు మైక్రో ఇరిగేషనే పరిష్కారం

**మొదటిపేజీ తరువాయి**

పరికరాల అమరికలో ఎలాంటి ఆలస్యం జరగకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఇంకా పూర్తి కాకుండా పెండింగ్‌లో ఉన్న డ్రిప్ ప్రాజెక్టులకు సంబంధించి తక్షణమే ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను (యాక్షన్ ప్లాన్) సిద్ధం చేయాలని మంత్రి కంపెనీలకు నిర్దేశించారు. బీఎంఎస్ , బీఓక్యూ ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, పరిపాలనాపరమైన అనుమతుల కోసం అధికారులకు పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలనలు మరియు ప్రభుత్వ అనుమతుల ప్రక్రియలో ఎక్కడా అనవసరమైన జాప్యానికి తావివ్వకూడదని హెచ్చరించారు. డ్రిప్ వ్యవసాయ పద్ధతి ద్వారా తక్కువ నీరు మరియు పరిమిత విద్యుత్‌ను వినియోగించి గరిష్ఠ స్థాయిలో పంట దిగుబడిని సాధించవచ్చని మంత్రి వివరించారు. రాబోయే రోజుల్లో సాంప్రదాయ పంటల నుంచి లాభదాయకమైన ఆల్టర్నేటివ్ (ప్రత్యామ్నాయ) పంటల వైపు రైతులను మళ్లించే పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) ప్రక్రియలో మైక్రో ఇరిగేషన్ అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రోత్సహిస్తున్న ఆయిల్ పామ్ పంట సాగుకు అవసరమైన డ్రిప్ సదుపాయాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. ఆయిల్ పామ్ రైతులు ఇబ్బంది పడకుండా డ్రిప్ పరికరాల సరఫరా మరియు అమరిక ప్రక్రియలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.రైతులకు డ్రిప్ సేద్యం వల్ల కలిగే ప్రయోజనాలపై గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాలు, రైతు సదస్సులలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని మంత్రి సూచించారు. డ్రిప్ సిస్టమ్ల నిర్వహణ, వాడకంపై రైతులకు అవగాహన కల్పించే బాధ్యతను కంపెనీలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, కంపెనీలకు రావలసిన పెండింగ్ బిల్లుల చెల్లింపులకు సంబంధించి ప్రభుత్వం సానుకూలంగా ఉంటూ తగిన కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

గత రెండు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు సంబంధించి బకాయి ఉన్న సుమారు రూ. 400 కోట్లను ఇప్పటికే విడుదల చేసిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సందర్భంగా వెల్లడించారు. మైక్రో ఇరిగేషన్ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఈ చెల్లింపులే నిదర్శనమని, ఆర్థిక ఇబ్బందులు లేకుండా కంపెనీలు సేవలను విస్తరించాలని ఆయన కోరారు.సూక్ష్మ సాగునీటి రంగ విస్తరణలో మరియు నీటి యాజమాన్య పద్ధతుల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా, ఆదర్శవంతంగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసం



జిల్లాల వారీగా ప్రతి మైక్రో ఇరిగేషన్ కంపెనీ పనితీరుపై నిరంతర సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. లక్ష్యాలను సాధించడంలో విఫలమయ్యే లేదా మందకొడిగా పనిచేసే కంపెనీలపై చర్యలు ఉంటాయని సూచనలు చేశారు.

# ధర్నాల నుంచి దాడుల దాకా..

- **ఎటు వెళ్తోంది వికారాబాద్ రాజకీయం?**
- **కాంగ్రెస్–బీజేపీ మధ్య ముదురుతున్న పోరు..**
- **ఎన్టీఆర్ చౌరస్తాలో బాహాబాహీతో బహిర్గతమైన విభేదాలు**

ఒకప్పుడు రాజకీయ విమర్శలు.. ఆ తర్వాత ధర్నాలు, ఆందోళనలు.. ఇప్పుడు నేరుగా రోడ్డుపై బాహాబాహీ! వికారాబాద్‌లో కాంగ్రెస్-బీజేపీ మధ్య పెరుగుతున్న రాజకీయ వైరం ఇక మాటల యుద్ధం దాటి ఘర్షణల స్థాయికి చేరిందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనానికి కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించడం.. దాన్ని బీజేపీ నాయకులు అడ్డుకోవడంతో ఎన్టీఆర్ చౌరస్తా వద్ద చోటుచేసుకున్న పరిణామాలు ఒక్కసారిగా రాజకీయ వేడిని తారస్థాయికి తీసుకెళ్లాయి. ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, పరస్పర దూషణలు, సవాళ్లతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితి చేయిదాటే అవకాశం కనిపించడంతో పోలీసులు రంగంలోకి దిగి ఇరుపార్టీల నాయకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

ఇది ఒక్కరోజు జరిగిన సంఘటనగా మాత్రమే చూడాలా? లేక వికారాబాద్‌లో ముదురుతున్న రాజకీయ పోరుకు ఇది మరో సంకేతమా? అన్న చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో మొదలైంది.

**మాటల యుద్ధం.. రోడ్డుపైకి వచ్చిందా?**

వికారాబాద్ రాజకీయాల్లో కాంగ్రెస్-బీజేపీ మధ్య పోటీ కొత్తది కాదు. అయితే ఇటీవలి కాలంలో ఇరుపార్టీల మధ్య ఆరోపణలు-ప్రత్యారోపణలు, నిరసనలు, ప్రతినిరసనలు పెరుగుతున్నాయి. మార్చి నెలలోనూ వికారాబాద్ జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగినట్లు వార్తలు వెలువడ్డాయి. అభివృద్ధి పనులు, భూసేకరణ, అరెస్టుల అంశాల నేపథ్యంలో మాటల యుద్ధం భౌతిక ఘర్షణకు దారితీసినట్లు అప్పటి నివేదిక పేర్కొంది. తాజాగా మోదీ దిష్టిబొమ్మ దహనం అంశం మరోసారి రెండు పార్టీలను ఎదురెదురుగా నిలిపింది.

**అధికార పార్టీ వర్సెస్ బిజెపి**

**బలప్రదర్శనకు వేదికగా వికారాబాద్?**

ప్రస్తుతం వికారాబాద్ రాజకీయ సమీకరణాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉండగా, బీజేపీ పార్లమెంట్ సభ్యులు ఉన్నారు. వికారాబాద్ నియోజకవర్గానికి గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు; ఆయన తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా కూడా ఉన్నారు.

ఇదే సమయంలో పట్టణ రాజకీయాల్లోనూ కాంగ్రెస్ ప్రభావాన్ని విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2026 మున్సిపల్ ఎన్నికల అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కుమార్తె గడ్డం అనన్య వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ తన రాజకీయ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తుండగా.. బీజేపీ అధికార పార్టీకి ప్రత్యామ్నాయ శక్తిగా తన ఉనికిని బలపర్చుకునే ప్రయత్నం చేస్తోందన్నది రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. ఇదే పోటీ ఇప్పుడు రోడ్లపై నిరసనలకు.. నిరసనలు ఘర్షణలకు దారితీస్తున్నాయా? అన్నదే కీలక ప్రశ్న.

**ఎన్టీఆర్ చౌరస్తా ఘటన.. ముందున్న రాజకీయ తుఫానుకు సంకేతమా?**

తాజా ఘర్షణలో ఇరువర్గాల నాయకులు పరస్పరం సవాళ్లు విసురుకోవడం, తీవ్ర పదజాలంతో వాగ్వాదానికి దిగడం రాజకీయ పోరులో కొత్త దశను సూచిస్తోందని స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

సాధారణంగా ఒక పార్టీ నిరసన చేపడితే మరో పార్టీ దానికి కౌంటర్ నిరసన చేయడం రాజకీయాల్లో సహజమే. కానీ కౌంటర్ నిరసన కాస్తా ప్రత్యక్ష ఘర్షణగా మారితే మాత్రం పరిస్థితి మరింత సున్నితంగా మారుతుంది.

ఒక ఘటనకు మరో ఘటనతో సమాధానం చెప్పే పరిస్థితి ఏర్పడితే..

ఒక దిష్టిబొమ్మ దహనానికి మరో దిష్టిబొమ్మ దహనం..

ఒక ధర్నాకు మరో ధర్నా..

ఒక ఆరోపణకు మరో ఆరోపణ..

చివరికి ఒక ఘర్షణకు మరో ఘర్షణ అనే పరిస్థితి రావచ్చు.

అదే జరిగితే వికారాబాద్‌లో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కే ప్రమాదం ఉంది.

రాబోయే రోజుల్లో ఏం జరగొచ్చు?

1. కౌంటర్ పాలిటిక్స్ మరింత పెరిగే అవకాశం

తాజా ఘటన తర్వాత ఇరుపార్టీలు ఒకరిపై ఒకరు రాజకీయంగా పైచేయి సాధించేందుకు ప్రయత్నించే అవకాశం ఉంది. ఒక పార్టీ నిరసనకు దిగితే మరో పార్టీ కూడా వెంటనే కౌంటర్ కార్యక్రమానికి దిగే పరిస్థితి ఏర్పడవచ్చు.

2. చిన్న ఘటన పెద్ద వివాదంగా మారే ప్రమాదం

ఇప్పటికే ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత కనిపిస్తున్న నేపథ్యంలో చిన్న మాట, చిన్న తోపులాట కూడా పెద్ద రాజకీయ వివాదానికి దారితీసే అవకాశం ఉంది.

ఇక్కడే పోలీసుల పాత్ర కీలకం.

నిరసన కార్యక్రమాలకు అనుమతులు, ఇరు వర్గాలను వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించడం, సున్నిత ప్రాంతాల్లో ముందస్తు బందోబస్తు వంటి చర్యలు తీసుకోకపోతే పరిస్థితి మరింత క్లిష్టమయ్యే అవకాశం ఉంది.

3. సోషల్ మీడియా మరో యుద్ధభూమిగా మారొచ్చు

రోడ్డుపై జరిగిన ఘర్షణ తర్వాత సోషల్ మీడియాలో వీడియోలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు వైరల్ కావడం ద్వారా రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశం ఉంది.

ఒక పార్టీ తమ వాదనను బలపరిచే వీడియోను ప్రచారం చేస్తే.. మరో పార్టీ మరో కోణాన్ని ముందుకు తెచ్చే అవకాశం ఉంది.

దీంతో వాస్తవ ఘటన కంటే రాజకీయ నారేటివ్ పోరు మరింత తీవ్రం కావచ్చు.

4. అసలు సమస్యలు పక్కకు వెళ్లే ప్రమాదం





వికారాబాద్‌కు అవసరమైన అభివృద్ధి, రోడ్లు, తాగునీరు, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులు వంటి అంశాలపై రాజకీయ చర్చ జరగాల్సిన సమయంలో.. పార్టీలు ఒకరిపై ఒకరు దాడులు, ప్రతిదాడులతో సమయం గడిపితే ప్రజా సమస్యలు వెనుకబడే ప్రమాదం ఉంది.

ఇదే సమయంలో వికారాబాద్ అభివృద్ధి పనులపై అధికార పక్షం దృష్టి పెడుతోందని, నిధులు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పలు సందర్భాల్లో పేర్కొన్నారు.

**కాంగ్రెస్‌కు పరీక్ష.. బీజేపీకి అవకాశం?**

తాజా పరిణామాలు కాంగ్రెస్‌కు ఒక రాజకీయ పరీక్షగా మారవచ్చు.

అధికారంలో ఉన్న పార్టీగా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులపై సంయమనం పాటించాలన్న బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలకు రాజకీయంగా సమాధానం ఇవ్వడం ఒక ఎత్తయితే.. ఘర్షణలకు దారితీయకుండా పార్టీ శ్రేణులను నియంత్రించడం మరో కీలక అంశం. మరోవైపు బీజేపీకి ఈ పరిణామాలు అధికార కాంగ్రెస్‌పై దాడి చేయడానికి రాజకీయ అవకాశాన్ని కల్పించవచ్చు. "అధికార పార్టీని ప్రశ్నిస్తున్నాం" అనే నినాదంతో బీజేపీ మరింత దూకుడుగా ముందుకు వెళ్లే అవకాశం ఉంది. అయితే బీజేపీ కూడా నిరసనల పేరుతో ఘర్షణలకు దారి తీసే పరిస్థితిని నివారించాల్సిన అవసరం ఉంటుంది.

**వికారాబాద్ రాజకీయాల్లో కొత్త పోటీకి తెర?**

ఇప్పటివరకు కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ ఎంపీ ఎన్నికల సమయాల్లో లేదా నిర్దిష్ట రాజకీయ అంశాలపై ఎక్కువగా కనిపించేది.

కానీ ఇప్పుడు రోజువారీ రాజకీయ కార్యక్రమాల స్థాయిలోనే ఇరుపార్టీలు ఎదురెదురవుతున్న పరిస్థితి ఏర్పడితే.. వికారాబాద్ రాజకీయాల్లో కొత్త పోటీకి తెరలేచినట్లే. రాజకీయ ఆధిపత్యం కోసం ఇరుపార్టీలు చేసే ప్రయత్నాలు రాబోయే రోజుల్లో మరింత స్పష్టంగా కనిపించే అవకాశం ఉంది.

అయితే ఈ పోటీలో ఎవరు పైచేయి సాధిస్తారనేది కేవలం నినాదాలు, దిష్టిబొమ్మల దహనాలు, ధర్నాలు, ఘర్షణలతో తేలదు. ప్రజలు ఎవరి వైపు నిలుస్తారన్నదే అసలు తీర్పు.

**చివరికి ప్రజల తీర్పే కీలకం!**

వికారాబాద్‌లో కాంగ్రెస్–బీజేపీ మధ్య రాజకీయ పోరు ఎంత తీవ్రంగా మారినా.. ప్రజలకు కావాల్సింది మాత్రం ఘర్షణలు కాదు.

వారికి కావాల్సింది అభివృద్ధి.

వారికి కావాల్సింది మెరుగైన వైద్యం.

వారికి కావాల్సింది మంచి రోడ్లు, తాగునీరు, ఉపాధి, మౌలిక వసతులు.

అందుకే రానున్న రోజుల్లో ఇరుపార్టీలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటాయా? లేక ప్రజా సమస్యలపై పోటీ పడతాయా? అన్నదే అసలు ప్రశ్న.

ఎన్టీఆర్ చౌరస్తాలో జరిగిన ఘర్షణతో ప్రస్తుతానికి రాజకీయ వేడి చల్లారలేదు.. మరింత పెరిగే సూచనలే కనిపిస్తున్నాయి.

ధర్నాల నుంచి దాడుల దాకా వచ్చిన వికారాబాద్ రాజకీయం..

ఇక అభివృద్ధి రాజకీయాల వైపు మళ్లుతుందా? లేక ఘర్షణల రాజకీయమే కొనసాగుతుందా?**

రానున్న రోజుల్లోనే తేలనుంది!

**ఎం రవీందర్**
**సీనియర్ జర్నలిస్ట్**
**7901503777**

# ఆగస్టు 1 మహాధర్నాను విజయవంతం చేయాలి

- **ఇందిరా పార్క్‌లో నిర్వహించబోయే ఉపాధ్యాయుల మహాధర్నా**
- **గోడపత్రిక ఆవిష్కరణ**
- **పెండింగ్ సమస్యల పరిష్కారమే లక్ష్యం**
- **ఉపాధ్యాయులు, పెన్షనర్లు భారీగా తరలిరావాలని తపస్ సంఘం విజ్ఞప్తి**

**పెద్దేముల్,జూలై 25 (ప్రజాక్షేత్రం):**

ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో ఆగస్టు 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని తపస్ సంఘం వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల బస్వరాజ్ , పెద్దేముల్ మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ సెంటర్‌లో మహాధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ పీఆర్సీ, డీఏ నివేదిక విడుదల, 51% శాతం ఫిట్‌మెంట్ అమలు, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయడం వంటి ప్రధాన డిమాండ్ల సాధన కోసం ఈ మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న ఈ మహాధర్నాలో ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్‌తో పాటు మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# బాలాపూర్ డివిజన్ 62 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నీరుడి శ్రీరాములు

**మహేశ్వరం జులై 25( ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం 62 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నీరుడి శ్రీరాములు నియమించడం జరిగింది . ఈ సందర్భంగా శరీ రాములు మాట్లాడుతూ.. ఈ యొక్క బాధ్యత అప్పజెప్పిన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచెన్ గారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేస్తూ.. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చెల్లా నరసింహారెడ్డి మరియు మాజీ మేయర్ పిసిసి జనరల్ సెక్రటరీ పారిజాత




నర్సింహారెడ్డి మరియు వందేటి ప్రభాకర్ రెడ్డికి మరియు రంగారెడ్డి జిల్లా సెక్రెటరీ బాల్ లింగని జంగయ్య మాజీ కార్పొరేటర్లు ఎర్ర మహేశ్వరి జైహింద్ బాలు నాయక్ లకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు.

# 'గోవింద' నామస్మరణతో మారుమోగిన వెంకులోని గుట్ట

**కీసర, జూలై 25(ప్రజా క్షేత్రం):**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కీసర మండలం రాంపల్లి దయారా గ్రామంలోని వెంకులోని గుట్టపై వెలసిన హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణం అంతా "గోవింద... గోవింద..." నామస్మరణతో మారుమోగింది.

ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వరస్వామి అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు, ధనధాన్య సమృద్ధి కలగాలని ఆలయ ట్రస్ట్ ఆకాంక్షించింది. మహోత్సవాన్ని విజయవంతం చేసిన భక్తులు, దాతలు, స్వచ్ఛంద సేవకులు, అర్చకులు,



ఆలయ సిబ్బంది, పోలీసు శాఖ, మీడియా ప్రతినిధులకు ట్రస్ట్ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# బాలలపై 'ముస్కాన్' పంజా!

- **వికారాబాద్‌లో 103 మంది చిన్నారులకు విముక్తి..**
- **86 మంది బాల కార్మికులు, 16 మంది డ్రాపౌట్లు**
- **47 కేసులు నమోదు..**
- **ఇతర రాష్ట్రాలకు చెందిన 33 మంది పిల్లలకు రక్షణ | బాల్య వివాహంపై ఒక కేసు**

**వికారాబాద్,జూలై 25(ప్రజాక్షేత్రం):**

బాలలను పనుల్లోకి దింపుతున్న ముఠాలు, చదువుకు దూరం చేస్తున్న పరిస్థితులు, బాల్య వివాహాలకు తెరతీస్తున్న కుటుంబాలపై వికారాబాద్ జిల్లా పోలీసుల 'ఆపరేషన్ ముస్కాన్-XII' పంజా విసురుతోంది. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు కొనసాగుతున్న ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో ఇప్పటివరకు 103 మంది చిన్నారులను రక్షించడం కలకలం రేపుతోంది. వీరిలో ఏకంగా 86 మంది బాల కార్మికులు ఉండటం జిల్లాలో బాలల పరిస్థితికి అద్దం పడుతోంది.

రక్షించిన వారిలో 95 మంది బాలురు, 8 మంది బాలికలు ఉన్నారు. మరో 16 మంది పాఠశాల మానేసిన చిన్నారులను గుర్తించి రక్షించగా, బాల్య వివాహానికి సంబంధించిన ఒక బాధితురాలిని కూడా అధికారులు కాపాడారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చి వివిధ పనుల్లో నిమగ్నమైన 33 మంది చిన్నారులను రక్షించడం ఆపరేషన్ తీవ్రతను తెలియజేస్తోంది.

**47 కేసులు.. 71 మంది తల్లిదండ్రుల చెంతకు**

ఆపరేషన్ ముస్కాన్-XIIలో భాగంగా ఇప్పటివరకు 47 కేసులు నమోదు చేశారు. రక్షించిన 103 మంది చిన్నారుల్లో 71 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. మరో 32 మందిని సంరక్షణ గృహాలకు తరలించారు. పిల్లల భద్రత, కుటుంబ పరిస్థితులు, విద్యాభ్యాసం తదితర అంశాలను పరిశీలిస్తూ తదుపరి చర్యలు చేపడుతున్నారు.

**అధికారుల సమన్వయంపై సమీక్ష**

ఆపరేషన్ ముస్కాన్-XII అమలుపై జిల్లా స్థాయి 3వ కన్వర్జెన్స్ సమావేశం శనివారం వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ) కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, ఐపీఎస్ సమావేశానికి హాజరై మూడు సబ్ డివిజన్లకు చెందిన ఆపరేషన్ ముస్కాన్ బృందాలు, సంబంధిత శాఖల అధికారులు, భాగస్వామ్య విభాగాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం, పాఠశాలలకు దూరమైన పిల్లలను తిరిగి విద్యా వ్యవస్థలో చేర్చడం, బాల్య వివాహాలను అడ్డుకోవడం, నిరాశ్రయులు, ప్రమాదంలో ఉన్న చిన్నారులను గుర్తించి రక్షించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి కేసులో ఆలస్యం లేకుండా స్పందించాలని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చిన్నారుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

**'బాల్యం'ను కాపాడే ఆపరేషన్**

చిన్నారులను పనుల్లో పెట్టుకునే యజమానులు, బాలల హక్కులను ఉల్లంఘించే వ్యక్తులు, బాల్య వివాహాలకు పాల్పడే కుటుంబాలపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా అధికారులు దృష్టి సారిస్తున్నారు. బాలల హక్కుల పరిరక్షణతో పాటు రక్షించిన చిన్నారులు తిరిగి ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్లకుండా వారి భవిష్యత్తుపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్-XIIను మరింత ముమ్మరం చేసి, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, డ్రాపౌట్లు, నిరాశ్రయ మరియు ప్రమాదంలో ఉన్న చిన్నారుల సమస్యలపై నిరంతరం చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

**ముస్కాన్–XIIలో ఇప్పటివరకు..**

103 — రక్షించిన చిన్నారులు
95 — బాలురు
8 — బాలికలు
86 — బాల కార్మికులు
16 — పాఠశాల మానేసిన పిల్లలు
1 — బాల్య వివాహ బాధితురాలు
33 — ఇతర రాష్ట్రాలకు చెందిన పిల్లలు
47 — నమోదైన కేసులు
71 — తల్లిదండ్రులకు అప్పగింత
32 — సంరక్షణ గృహాలకు తరలింపు

సమన్వయంతో.. మరింత దూకుడుగా

సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా,ఇన్‌చార్జ్ కాంతారావు, షఫీ, అంజనేయులు, యాదయ్య , సంతోష్ రెడ్డి, చైల్డ్‌లైన్ ప్రతినిధి రాజు నాయక్, మహేష్, ఆనంద్, నరేష్ కుమార్ (లీగల్ సెల్), రాజిత (బాలసదనం ఇన్‌చార్జ్), సాధన ఎన్జీవో ప్రతినిధి నర్సింలు, బృందం సభ్యులు రామకృష్ణతో పాటు మూడు సబ్ డివిజన్ల ఆపరేషన్ ముస్కాన్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.




# ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో నేను ఓట్లు అడగను, దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**మహబూబ్ నగర్ జిల్లా,జూలై 25 (ప్రజాక్షేత్రం):**

ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో తాను ఓట్లు అడగనని, బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు ఎక్కడ ఇచ్చిందో అక్కడే ఆ పార్టీ నాయకులు ఓట్లు అడగాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సవాల్ విసిరారు. దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో తాను ఓట్లు అడగనని, బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు ఎక్కడ ఇచ్చిందో అక్కడే ఆ పార్టీ నాయకులు ఓట్లు అడగాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సవాల్ విసిరారు. శనివారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని, అవసరమైన ప్రతి అర్హ కుటుంబానికి ఇళ్లు అందించే వరకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఇళ్లు నిర్మించి ఓట్లు అడిగే నైతిక అర్హత కాంగ్రెస్కే ఉందని, బీఆర్ఎస్కు లేదని విమర్శించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్నామని, పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ వంటి



అవకాశాలను మండల మహిళా సమాఖ్యలకు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం పేదలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా సంక్షేమం కంటే అవినీతి,దోపిడీకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని, ప్రజల ఆదరణతో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లవి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు బోయేజ్, అఖిల సుభాష్, సుధా రామ్మోహన్ రెడ్డి, సంజీవులు, మురళి యాదవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల కాంగ్రెస్‌లో 'పాత–కొత్త' కుంపటి!

- **యాదయ్య వర్సెస్ భీమ్ భరత్.. ఆధిపత్య పోరుతో రగులుతున్న కాంగ్రెస్**
- **మండల అధ్యక్షుల నియామకాలతో భగ్గుమన్న విభేదాలు..**
- **గాంధీభవన్ మెట్లెక్కిన అసంతృప్తి నేతలు**





ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు తారస్థాయికి చేరుతున్నాయా? పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేసిన పాత కాంగ్రెస్ నేతలు, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నేతల మధ్య ఆధిపత్య పోరు రోజురోజుకూ ముదురుతోందా? తాజా పరిణామాలు చూస్తే అవుననే సమాధానం వస్తోంది. ఎమ్మెల్యే కాలే యాదయ్య, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ భీమ్ భరత్ వర్గాల మధ్య సమన్వయం కొరవడటంతో నియోజకవర్గ కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు బహిర్గతమవుతున్నాయనే చర్చ జోరుగా సాగుతోంది.

**ఒకే పార్టీలో.. రెండు వర్గాలు!**

బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే కాలే యాదయ్య కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత చేవెళ్ల నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన భీమ్ భరత్ ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ ఇద్దరూ కాంగ్రెస్‌లోనే ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం రెండు వర్గాలుగా పార్టీ శ్రేణులు విడిపోయాయనే ప్రచారం జరుగుతోంది. ఎవరికి వారే అన్నట్టుగా కార్యక్రమాలు నిర్వహించడం, పదవుల విషయంలో తమ వర్గం వారికి ప్రాధాన్యం కల్పించేందుకు ప్రయత్నాలు చేయడం వంటి పరిణామాలు పార్టీ అంతర్గత విభేదాలకు మరింత ఆజ్యం పోస్తున్నాయని కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.

**మండల అధ్యక్షుల నియామకంతో మంటలు**

ఇటీవల నియోజకవర్గంలోని మండలాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమించడం వివాదానికి కేంద్రబిందువుగా మారింది. మొత్తం ఐదు మండలాల్లో రెండు చోట్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తన వర్గానికి చెందిన వారికి పదవులు ఇప్పించారనే ఆరోపణలు భీమ్ భరత్ వర్గం నుంచి వినిపిస్తున్నాయి.

ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ జెండా మోస్తూ పార్టీ కోసం పనిచేసిన తమను పక్కన పెట్టి.. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడం ఏమిటని పాత కాంగ్రెస్ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. పదవుల పంపకంలో స్థానికంగా పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గాంధీభవన్ మెట్లెక్కిన అసంతృప్తి మండల అధ్యక్షుల నియామకంపై అసంతృప్తి కేవలం నియోజకవర్గానికే పరిమితం కాలేదు. ఏకంగా హైదరాబాద్‌లోని గాంధీభవన్ వరకు చేరింది. పార్టీకి చెందిన అసంతృప్తి నేతలు, కార్యకర్తలు గాంధీభవన్ వద్ద ఆందోళనకు దిగడం, ఎమ్మెల్యే కాలే యాదయ్యకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

వికారాబాద్ జిల్లా నవాబ్‌పేటకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు కూడా గాంధీభవన్ వద్ద నిరసన వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీలోనూ, ప్రభుత్వ వ్యవహారాల్లోనూ ఎమ్మెల్యే జోక్యం చేసుకోకూడదంటూ కొందరు నేతలు డిమాండ్ చేసినట్లు సమాచారం.

**నవాబ్‌పేటలో మరింత ముదిరిన వివాదం**

నవాబ్‌పేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడి మార్పు వ్యవహారం వివాదానికి మరింత ఆజ్యం పోసింది. ఎమ్మెల్యే కాలే యాదయ్య తన వర్గానికి చెందిన రావుగారి వెంకట్‌రెడ్డి పేరును సిఫారసు చేశారని, అప్పటికే ఆ పదవిలో ఉన్న సామ వెంకట్‌రెడ్డిని తప్పించి కొత్త అధ్యక్షుడిని నియమించడంపై ఆయన వర్గం తీవ్రంగా వ్యతిరేకించిందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పాత నాయకత్వాన్ని కాదని కొత్తగా వచ్చిన వారికి పదవులు ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సామ వెంకట్‌రెడ్డి వర్గీయులు గాంధీభవన్ వద్ద ఆందోళన చేపట్టడం ద్వారా తమ నిరసను బహిరంగంగా వ్యక్తం చేశారు.

**'బీఆర్ఎస్ నేతలకే పదవులా?'**

కాలే యాదయ్య కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి నియోజకవర్గంలో పాత కాంగ్రెస్ నేతలు, బీఆర్ఎస్ నుంచి వచ్చిన నేతల మధ్య దూరం పెరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన తమను విస్మరించి.. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు, ప్రాధాన్యం ఇవ్వడం వల్లే కేడర్‌లో అసంతృప్తి పెరుగుతోందని పాత కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు.

'పార్టీ కష్టకాలంలో జెండా మోసిన కార్యకర్తల సంగతేంటి?' అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిణామాలు పార్టీ క్షేత్రస్థాయి నిర్మాణంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని జిల్లా స్థాయి నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**యాదయ్యకు నిరసనలు**

**కొత్తేమీ కాదంటున్న వర్గం**

అయితే ఎమ్మెల్యే కాలే యాదయ్య వర్గం మాత్రం ఈ విమర్శలను కొట్టిపారేస్తోంది. యాదయ్యకు వ్యతిరేకంగా గతంలోనూ నిరసనలు జరిగిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఆయనపై గుడ్లు, టమాటాలు విసిరి 'గో బ్యాక్' అంటూ కొందరు నినాదాలు చేసిన ఘటనలను ప్రస్తావిస్తున్నారు. ఇటీవల షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల ఘటనలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన ఎమ్మెల్యేకు అక్కడ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన విషయం కూడా చర్చకు వస్తోంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఎమ్మెల్యేను అక్కడి నుంచి పంపించినట్లు ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఘటనలను పార్టీ అంతర్గత రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదని వారు అంటున్నట్లు సమాచారం.

**రేపటి పరిషత్ ఎన్నికలే అసలు పరీక్ష!**

చేవెళ్ల కాంగ్రెస్‌లో కొనసాగుతున్న ఈ అంతర్గత విభేదాలు ఇలాగే కొనసాగితే రాబోయే పరిషత్ ఎన్నికలపై ప్రభావం పడే అవకాశం ఉందనే ఆందోళన పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. మండల, గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే వర్గాలుగా విడిపోతే ఎన్నికల సమయంలో పార్టీ అభ్యర్థుల ఎంపిక, ప్రచారం, సమన్వయం వంటి అంశాలు మరింత సంక్లిష్టంగా మారే అవకాశం ఉందని నాయకులు భావిస్తున్నారు. అధికార పార్టీగా కాంగ్రెస్ బలంగా ఉండాల్సిన సమయంలోనే అంతర్గత కుమ్ములాటలు బహిర్గతం కావడం పార్టీకి నష్టం చేస్తుందని కొందరు సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఇన్‌చార్జ్ భీమ్ భరత్ వర్గాల మధ్య సమన్వయం కుదిర్చి.. పాత, కొత్త నేతల మధ్య నెలకొన్న విభేదాలకు పార్టీ అధిష్ఠానం వెంటనే తెరదించాలని కేడర్ కోరుతోంది.

ఇప్పటికే గాంధీభవన్ వరకు చేరిన చేవెళ్ల కాంగ్రెస్ అంతర్గత వివాదం.. రానున్న రోజుల్లో ఇంకెంత దూరం వెళ్తుందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

**ఏం రవీందర్**
**సీనియర్ జర్నలిస్ట్**

# ఆయుధాలపై పట్టు.. ప్రజల భద్రతకు బలం

- **వార్షిక ఫైరింగ్‌లో ఎస్పీతో కలిసి పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది**
- **ప్రతిభ కనబర్చిన వారికి అభినందనలు.. క్రమశిక్షణ, ఆరోగ్యంపైనా సూచనలు**

**వనపర్తి,జూలై 25 (ప్రజాక్షేత్రం):**

ప్రజల ప్రాణాలు,ఆస్తుల రక్షణలో పోలీసు సిబ్బందికి ఆయుధాల వినియోగంపై పూర్తి నైపుణ్యం అత్యంత అవసరమని జిల్లా ఎస్పీ సునితారెడ్డి అన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, వృత్తిపరమైన నైపుణ్యాలతో పనిచేస్తేనే పోలీసుశాఖపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లిలోని 10వ తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్ ఫైరింగ్ రేంజ్‌లో వనపర్తి జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి నిర్వహించిన రెండ్రోజుల వార్షిక ఫైరింగ్ శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా అదనపు ఎస్పీ, ఇతర అధికారులతో కలిసి ఫైరింగ్ నిర్వహించి తమ ఆయుధ నైపుణ్యాన్ని పరీక్షించుకున్నారు.

పది రౌండ్ల ఫైరింగ్.. ప్రతిభకు ప్రశంసలు

శిక్షణలో భాగంగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బందికి విధుల్లో వినియోగించే ఆయుధాలతో పది రౌండ్ల ఫైరింగ్ చేసే అవకాశం కల్పించారు. ఫైరింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ ఇదే స్థాయి నైపుణ్యాన్ని కొనసాగించాలని సూచించారు.

**ఆయుధాలు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి**

ప్రతి పోలీసు తమ వద్ద ఉన్న ఆయుధాల పనితీరు, వినియోగ విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఆయుధాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ సక్రమ స్థితిలో ఉంచాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజల భద్రతలో అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు.


**వ్యాయామం, ఆరోగ్యంపై దృష్టి**

విధి నిర్వహణలో శారీరక దృఢత్వం కీలకమని, ప్రతి పోలీసు ప్రతిరోజూ వ్యాయామాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, మానసిక స్థైర్యంతో పనిచేస్తే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించవచ్చన్నారు. చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండి పోలీసుశాఖ ప్రతిష్ఠను కాపాడాలని సూచించారు.

**సమస్యలు దాచొద్దు..**

**శాఖ అండగా ఉంటుంది**

వ్యక్తిగత, కుటుంబ, విధి నిర్వహణ లేదా ఆరోగ్య సంబంధిత సమస్యలు ఎదురైనా వాటిని ఉన్నతాధికారుల దృష్టికి వెంటనే తీసుకురావాలని ఎస్పీ సూచించారు. సమస్యల పరిష్కారానికి పోలీసుశాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి పోలీసు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ తెలంగాణ పోలీసుశాఖకు, వనపర్తి జిల్లా పోలీసులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ వినోద్, జిల్లా పోలీసు అధికారులు, ఎస్సైలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.




# కేంద్ర మంత్రి రాజీనామా యువత, విద్యార్థుల విజయమే

- **ధర్మేంద్ర ప్రధన్ రాజీనామాతో విద్యార్థులకు ఊరట**
- **బిఅర్ఎస్ నాయకులు షేక్ సోహైల్**

**జహిరాబాద్ జూలై 25 (ప్రజాక్షేత్రం):**

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధన్ రాజీనామాతో విద్యార్థులు, యువత చేసిన పోరాట ఫలితమే అని, గత మూడు రోజుల క్రితం బిఅర్ఎస్ వర్కింగ్ అధ్యక్షులు కెటిఅర్ నిరుద్యోగుల సభలో విద్యార్థులకు అండగా నిలిచి మంత్రి రాజీనామా చెయ్యాలని కోరిన విషయం తెలిసిందే అని బిఅర్ఎస్ యువ నాయకులు షేక్ సోహైల్ అన్నారు. శనివారం నాడు మధ్యాహ్నం కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధన్ రాజీనామా చెయ్యడంపై ఝురాసంగం మండలం బిఅర్ఎస్ నాయకులు షేక్ సోహైల్




స్వాగతించి విద్యార్థుల పోరాటానికి దక్కిన విజయంగా అభివర్ణిస్తూ బిఅర్ఎస్ పార్టీ విద్యార్థుల పక్షాన అండగా నిలిచి పోరాడుతుందని ఈ సందర్భంగా అన్నారు.

# చింతల్ నుంచి పద్మనగర్ వరకు చైతన్య యాత్ర

- **ఓటర్లలో చైతన్యం... పారిశుధ్యంపై అవగాహన**
- **ప్రజల మధ్యకు కళాబృందాలు..ఓటరు నమోదు, పారిశుధ్యంపై సందేశం**

**కుత్బుల్లాపూర్,జూలై 25 (ప్రజాక్షేత్రం):**

జీడిమెట్ల సర్కిల్ 55 పరిధిలో ప్రత్యేక సమగ్ర సవరణ2026 ( ఎస్ఐఆర్ 2026) కార్యక్రమంలో భాగంగా ఓటర్లలో చైతన్యం కల్పించేందుకు, అలాగే పారిశుధ్యం, తడి చెత్త-పొడి చెత్త వేరు చేయడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం కళాబృందాల ద్వారా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు చింతల్ యల్లమ్మ ఆలయం సమీపంలో, సాయంత్రం 6.00 గంటలకు పద్మనగర్ రింగ్ రోడ్ వద్ద కళాజాత ప్రదర్శనల ద్వారా ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం ప్రాముఖ్యత, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు వివరించారు. అదే సమయంలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, పరిశుభ్రమైన పరిసరాల కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని సందేశం అందించారు.

ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, ఓటర్లు విశేషంగా స్పందించారు. ప్రజా చైతన్య కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా చేరుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏఈఆర్ఓ, జీడిమెట్ల సర్కిల్ 55 డిప్యూటీ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.



## తొలి ఏకాదశి సందర్భంగా విఠలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

- **వరకుమార్ శర్మ,వేదాంత కృష్ణ శర్మ ఆధ్వర్యంలో యజుర్వేద సహిత పారాయణం**
- **ఏకాదశి నుండి గురు పౌర్ణమి వరకు విఠలేశ్వర ఆలయంలో ఆషాడ ఉత్సవాల నిర్వహణ**

**కోటగిరి,జులై 25(ప్రజాక్షేత్రం):**

ఆషాడమసం తొలి ఏకాదశి సందర్భంగా నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రం లోని రుక్మిణి విఠలేశ్వర ఆలయంలో ఆలయ అర్చకులు విజయ్ మహారాజ్ ఆధ్వరంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఉదయం అభిషేకం చేసి వర కుమార్ శర్మ, వేదాంత కృష్ణ శర్మ ఆధ్వర్యంలో యజుర్వేద సహిత పారాయణం చేశారు. ఈ సందర్భంగా కోటగిరి గ్రామ చుట్టుపక్కల భక్తులు పాల్గొని విఠలేశ్వరున్ని దర్శించుకున్నారు. అనంతరం అక్కడే కొనసాగుతున్న భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఠలేశ్వర ఆలయ అర్చకులు విజయ్ మహారాజ్ సతీమణి సంధ్యారాణి కులకర్ణి మీడియాతో మాట్లాడుతూ... పండరి పూర్ నుండి ఆషాడ మాసంలో ఈ విఠల్ రుక్మిణి మూర్తులు స్వయంగా రావడం జరిగిందని అన్నారు. ఆషాడ మాసం లో ఒకసారి కార్తీక మాసంలో ఒకసారి స్వయంగా వచ్చేవారని గుర్తు చేశారు. ఈ విఠలేశ్వర ఆలయంలో ఉన్న మూర్తులను దర్శించుకుంటే పండరి పూర్ కు వెళ్లి దర్శించుకుంటే ఎంత పుణ్యం వస్తదో అంతే పుణ్యం వస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ విఠలేశ్వరాలయంలో నేడు ఉదయం అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఉపవాస దీక్షలు ఉన్న భక్తజనులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణి, రామచంద్రరావు కులకర్ణి, బాబురావు ఎల్లప్ప సాయిలు, భూమయ్య సంతోష్ శకుంతల మౌనిక నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



## రుక్కమ్మకు అశ్రునివాళి

- **భారీ జనసందోహం మధ్య అంత్యక్రియలు..**
- **నివాళులర్పించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు**

**షాబాద్,జూలై 25(ప్రజాక్షేత్రం):**

శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిల మాతృమూర్తి పట్నం రుక్కమ్మ అంత్యక్రియలు శనివారం స్వగ్రామం గొల్లూరుగూడలో భారీ జనసందోహం మధ్య నిర్వహించారు. రుక్కమ్మ పార్థివదేహాన్ని ముందుగా హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న పట్నం మహేందర్ రెడ్డి నివాసంలో బంధుమిత్రుల సందర్శనార్థం ఉంచారు. అనంతరం షాబాద్‌లోని మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి నివాసానికి తీసుకువచ్చి ప్రజలు తుదివీడ్కోలు పలికేలా అవకాశం కల్పించారు. అక్కడి నుంచి స్వగ్రామం గొల్లూరుగూడకు అంతిమయాత్రగా తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు రుక్కమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్నం మహేందర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రుక్కమ్మ మరణవార్తతో గొల్లూరుగూడతో పాటు పరిసర గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వందలాది మంది ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు అంతిమయాత్రలో పాల్గొని రుక్కమ్మకు అశ్రునివాళులర్పించారు.



## ఆగస్టు 10న జరిగే "జైల్ భరో"ను జయప్రదం చేయండి

- **మాటూరి బాలరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి**

**వలిగొండ జూలై 25(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో శనివారం సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో "కేంద్ర ప్రభుత్వ విధానాలుపర్యవసానాలు" అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిర్పంగి స్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్లు, విద్యుత్ సవరణ బిల్లు, విత్తన చట్ట సవరణలు కార్మికులు, రైతులకు నష్టదాయకమని పేర్కొన్నారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ కల్పించాలని, ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు ఈ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించే "జైల్ భరో" కార్యక్రమాన్ని, అలాగే ఆగస్టు 6న వలిగొండలో జరిగే బైక్ ర్యాలీని కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెమినార్లో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, ఎస్ఎఫ్ఐ తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.




# ప్రభుత్వం మారింది...తాండ అభివృద్ధి ఆగింది!

- **తాండను చేరని అభివృద్ధి.. జోనల్ కమిషనర్‌కు మాజీ కౌన్సిలర్ వినతి**

**కుత్బుల్లాపూర్,జూలై 25 (ప్రజాక్షేత్రం):**

అభివృద్ధి పనులు అర్థాంతరంగా నిలిచిపోవడం, ప్రత్యామ్నాయ రహదారి లేక ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతుండటంతో దుండిగల్ సర్కిల్ పరిధిలోని తాండ2 సమస్యలను మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పునఃప్రారంభించి, తాండ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని రాతపూర్వక వినతిపత్రం సమర్పించారు.

మాజీ కౌన్సిలర్‌గా ఉన్న సమయంలో మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం ద్వారా రూ.1.80 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆమోదం లభించిందని, ప్రభుత్వం మారిన తర్వాత ఆ పనులు రద్దు కావడంతో తాండ అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని ఆయన వివరించారు.





డ్రైనేజీ పనులు పూర్తయినా, వాటి తర్వాత వేయాల్సిన రోడ్లు ఇప్పటికీ నిర్మించకపోవడంతో ప్రజలు బురద, దుమ్ము మధ్యనే రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా తాండ2 నుంచి బయటకు వెళ్లేందుకు ఒకే ఒక్క రహదారి ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తాండ2 నుంచి హెచ్ఎంటీ సొసైటీ మీదుగా తాండ1 వరకు, అక్కడి నుంచి సర్వీస్ రోడ్డు వరకు కొత్త రహదారిని మంజూరు చేయాలని కోరారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే వేలాది మంది ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి వస్తుందని, ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు అత్యవసర సేవలు కూడా వేగంగా చేరుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిలిచిపోయిన పనులను తక్షణమే పునరుద్ధరించాలని, తాండ అభివృద్ధిని మళ్లీ గాడిలో పెట్టాలని జోనల్ కమిషనర్‌ను కోరినట్లు శంకర్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రవీందర్ నాయక్, అమర్ సింగ్ నాయక్, హెచ్ఎంటీ సొసైటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 3 రోజుల ఇన్‌సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్ సక్సెస్

- **నూతన బోధనా విధానాలపై ఉపాధ్యాయులకు శిక్షణ**
- **ఎఫ్ఎల్ఎన్, రిమీడియేషన్‌పై ప్రత్యేక శిక్షణ**
- **కమ్యూనికేటివ్ టీచింగ్‌పై సమగ్ర అవగాహన**
- **విద్యార్థుల అభ్యసన ఫలితాల మెరుగుదలకు కార్యాచరణపై దృష్టి**
- **విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యం**

**పెద్దేముల్,జూలై 25 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష,ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో పెద్దేముల్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మూడు రోజుల ఇంటిగ్రేటెడ్ ఇన్‌సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్ (2వ విడత) కార్యక్రమం శనివారం విజయవంతంగా ముగిసింది.ఈ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్, మండల విద్యాధికారి (ఎంఈఓ) పి.నర్సింగ్ రావు అధ్యక్షత వహించగా, సెంటర్ ఇంచార్జి అక్కమహాదేవి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణలో ఎఫ్ఎల్ఎన్ తెలుగు, ఇంగ్లీష్, గణిత రిమీడియేషన్, కమ్యూనికేటివ్ టీచింగ్, యాక్టివిటీ ఆధారిత బోధన, నిరంతర సమగ్ర మూల్యాంకనం, విద్యార్థి కేంద్రిత బోధనా విధానాలు వంటి అంశాలపై ఉపాధ్యాయులకు సమగ్ర అవగాహన కల్పించారు. బోధనలో నూతన పద్ధతులను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపర్చే మార్గాలను వివరించారు.

**శిక్షణలో ఆర్‌పీలు**

**ఎస్.గంజి బంధ్యప్ప (గణితం),**

బి.నర్సిరెడ్డి (జనరల్), శోభన్ బాబు (ఇంగ్లీష్), రాఘవేందర్ (తెలుగు) తమ తమ అంశాలపై కార్యాచరణతో కూడిన శిక్షణను అందించి, ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేశారు. ముగింపు సమావేశంలో కోర్స్ డైరెక్టర్, మండల ఎంఈఓ పి.నర్సింగ్ రావు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న వినూత్న బోధనా విధానాలను ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో అమలు చేసి, ప్రతి విద్యార్థి అభ్యసన ఫలితాలను మెరుగుపర్చేందుకు కృషి చేయాలని సూచించారు.నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.

మండలంలోని వివిధ ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఈ శిక్షణలో ఉత్సాహంగా పాల్గొని, శిక్షణ తమ బోధనా నైపుణ్యాలను మరింత మెరుగుపర్చేందుకు ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో రిసోర్స్ పర్సన్లు, నిర్వాహకులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.






## ఎస్ఐఆర్ ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణపై గ్రామాలను జల్లెడ పడుతున్న కేఎల్ఆర్

- **పెండ్యాల గ్రామంలో పర్యటించిన కిచ్చెన్న**

**మహేశ్వరం జులై 25 (ప్రజాక్షేత్రం):**

ఆగస్టు 3న సర్ ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ ముగుస్తున్నందున్న ప్రతీ గ్రామాన్ని జల్లెడపతున్నారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి.సర్ లో 100శాతం ఓటర్ల జాబిత అప్ డేట్ కావాలని బిఎల్ఏ లకు, పార్టీ నూతన అధ్యక్షులకు, సర్పంచ్ లకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కేఎల్ఆర్ పలు సూచనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన దొంగఓట్లను ఏరిపారేయాలని పిలుపునిచ్చారు. పట్టణం - సొంతూరులో ఏదోఒక చోట మాత్రమే ఓటు ఉండాలని మరోసారి సూచించారు. చనిపోయిన వారి వివరాలను సైతం నమోదు చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్రలు తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సజావుగా కొనసాగుతుందని కిచ్చెన్నగారు చెప్పారు. ఓట్లను అస్త్రంగా చేసుకుని... హస్తం పార్టీ నేతలు, కార్యకర్తల ఓట్లను తొలగించేందుకు బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి... సంక్షేమ పథకాలకు... ఓటే వజ్రాయుధం అన్నారు. కావున ప్రతీ ఓటరు తమ ఓటుహక్కును కాపాడుకోవాలన్నారు. మరో పదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండాలంటే ఇప్పుడు జరుగుతున్న ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణలో పాల్గొని బిఎల్ఓ లకు సహకరించాలని లక్ష్మారెడ్డి - ( కెఎల్ఆర్ ) కోరారు.



## మంఖాల్ ప్రాథమిక పాఠశాలలో ఆకస్మికంగా కనిపించేసిన విద్యాధికారి వెంకటేశ్వర్లు

**మహేశ్వరం జులై 25 (ప్రజాక్షేత్రం):**

మహేశ్వరం మండలంలోని ప్రాథమిక పాఠశాల మంఖాల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మహేశ్వరం మండలంలోని ప్రాథమిక పాఠశాల, మంఖాల్ ను ఆకస్మికంగా సందర్శించి పాఠశాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాస స్థాయిలు,(ఎఫ్ఎల్ఎన్) (ఫౌండేషనల్ లీటరసీ & నూమెరేసీ ) కార్యక్రమం అమలు, తరగతి గది బోధన, లైబ్రరీ నిర్వహణ, విద్యార్థుల నోట్ బుక్స్, బోధనా విధానాలు, పాఠశాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వివిధ ప్రశ్నలు అడిగి వారి చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు, సాధారణ అవగాహనను స్వయంగా పరీక్షించారు.విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే క్రమశిక్షణతో చదవాలని, ఉపాధ్యాయుల సూచనలను పాటించాలని, తల్లిదండ్రులు మరియు పెద్దలను గౌరవించాలని, మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి విద్యార్థి అభ్యాస పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, (ఎఫ్ఎల్ఎన్) లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని, లైబ్రరీ వినియోగాన్ని మరింత పెంపొందించాలని, నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని పలు సూచనలు చేశారు.ఈ తనిఖీలో మహేశ్వరం మండల విద్యాధికారి డా. వి. కస్నా నాయక్ పాల్గొని పాఠశాలలో జరుగుతున్న విద్యా కార్యక్రమాలపై వివరాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి. రేణుక , వనజ పాల్గొని జిల్లా విద్యాశాఖ అధికారి సూచనలను స్వాగతిస్తూ పాఠశాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అధికారులతో ఆత్మీయంగా ముచ్చటించడం విశేషంగా నిలిచింది.



## తొలి ఏకాదశి వేళ భక్తిజన సంద్రంగా శ్రీ దుర్గా మల్లేశ్వర ఆలయం

- **భక్తుల రాకతో కిటకిటలాడిన గ్రీన్ హిల్స్ ఆలయం**
- **వాసుదేవ భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం**

**కుత్బుల్లాపూర్,జులై 25 (ప్రజాక్షేత్రం):**

దుండిగల్ సర్కిల్ పరిధిలోని బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ హౌసింగ్ కాలనీలో వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం తొలి ఏకాదశి సందర్భంగా భక్తిశ్రద్ధలతో కళకళలాడింది. పవిత్రమైన ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము ఐదు గంటల నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. స్వామివారికి విశేష పుష్పాలంకరణతో పాటు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లు తదితర సౌకర్యాలను కల్పించి పూజా కార్యక్రమాలు ప్రశాంతంగా సాగేలా చర్యలు చేపట్టారు. అనంతరం భక్తులంతా సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించి భక్తిరసంలో మునిగిపోయారు. తొలి ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి వాసుదేవ భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక భజన కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున హాజరై ఆధ్యాత్మిక అనుభూతిని పొందాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రవీందర్, చంద్రయ్య, వీరన్న, శ్రీనివాసరావు, శ్రీనివాస్ కుమార్, హరిబాబు, లవకుశ, సురేష్, రాంబాబు, టీడీ రావు, రామాంజనేయులు, శ్రీకాంత్, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ శర్మతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.





## ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసిన డిపో మేనేజర్‌కు కృతజ్ఞతలు

- **చందాపూర్ విద్యార్థుల సమస్యపై వెంటనే స్పందించిన ఆర్టీసీ అధికారులు**

**వనపర్తి,జూలై 25 (ప్రజాక్షేత్రం):**

వనపర్తి మండలం చందాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థుల ప్రయాణ సమస్యను గుర్తించి ప్రత్యేక సెటిల్ బస్సును ఏర్పాటు చేసిన వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రుల తరపున శనివారం వనపర్తి డిపో మేనేజర్ ను కలిసి మాజీ ఎంపీటీసీ బర్ల మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

చందాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాసపురం గ్రామానికి చెందిన సుమారు 35 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఉదయం పాఠశాల సమయానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో వారు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇటీవల మాజీ ఎంపీటీసీ బర్ల మహేందర్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.

వినతిపత్రంపై తక్షణమే స్పందించిన డిపో మేనేజర్, వనపర్తి నుంచి చందాపూర్ వరకు ప్రత్యేక సెటిల్ బస్సును ఏర్పాటు చేయడంతో విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకునే అవకాశం కలిగిందని ఆయన పేర్కొన్నారు. సమస్యను సానుకూలంగా పరిశీలించి వెంటనే చర్యలు తీసుకున్న డిపో మేనేజర్‌కు చందాపూర్ గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా వార్డు సభ్యుడు రాములు, మాజీ మార్కెట్ కమిటీ సభ్యుడు సి. మద్దిలేటి తదితరులు కూడా డిపో మేనేజర్ సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రత్యేక బస్సు ఏర్పాటు విద్యార్థుల చదువుకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## కోటగిరి యువకుడి వద్ద గంజాయి పట్టివేత...?

- **గంజాయి పట్టుకున్న విషయం గోప్యంగా ఉంచిన పోలీసులు..?**
- **ఓ రైస్ మిల్లు కు చెందిన గుమస్తా వద్ద దొరికిన గంజాయి..?**



**కోటగిరి, జులై 25(ప్రజాక్షేత్రం):**

కోటగిరి మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడి వద్ద పోలీసులు భారీగా గంజాయి పట్టుకున్నట్లు స్థానికంగా చర్చలు నడుస్తున్నాయి. రుద్రూర్ సర్కిల్ పరిధిలోని ఓ రైస్ మిల్లు లో పనిచేసేందుకు రెండు రోజుల క్రితం బీహార్ నుండి వచ్చిన కూలీల వద్ద ఆ యువకుడు గంజాయి తీసుకుంటుండగా దాడి చేసిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచిన పోలీసులు ఎలాంటి వివరాలు బహిర్గతం చేయకపోయినప్పటికీ ఆ యువకుడిని మాత్రం అదుపులోకి తీసుకున్నట్లు స్థానికంగా చర్చలు నడుస్తున్నాయి. అయితే ఆ యువకుడిని పట్టుకున్నది స్థానిక పోలీసులా లేదా ప్రత్యేక బృందం పోలీసులా, అతడి వద్ద ఎంత మొత్తంలో గంజాయి దొరికింది అనే విషయంలో మాత్రం స్పష్టత లేదు. కాగా ఆ యువకుడు కోటగిరి మండల కేంద్రానికి చెందిన ఓ రైస్ మిల్లులో పనిచేసే గుమాస్తాగా ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే కోటగిరి మండలంలో యువకులు గంజాయికి బానిసైన విషయంలో వచ్చిన వార్తల మేరకు గంజాయి వ్యవహారంపై నిజామాబాద్ సిపి ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు, నార్కోటిక్స్ డిపార్ట్మెంట్ వారు గంజాయి నిర్మూలనకై పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ప్రస్తుతం ఓ యువకుడి వద్ద గంజాయి దొరికిందనే వార్తలు రావడం చర్చనీయాంశంగా మారింది. కోటగిరి ఉమ్మడి మండలాలలోని గంజాయి వ్యవహారంపై గతంలో ప్రత్యేకంగా మండలానికి వచ్చి ఆరా తీసిన నిజామాబాద్ సిపి సైతం గుర్రుగా ఉన్నట్లు తెలుస్తుంది. ఇలాంటి తరుణంలో కోటగిరి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి వద్ద గంజాయి పట్టుబడ్డట్లు ప్రచారం జరగడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు.ఈ విషయమై రుద్రూర్ సీఐ కృష్ణను వివరణ కోరగా తమకు సమాచారం లేదని పూర్తి సమాచారం అందిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో కోటగిరి మండలంలో సద్దుమణిగిందనుకున్న గంజాయి వ్యవహారంలో ప్రస్తుతం గంజాయి పట్టుబడిందనే వార్తలు మండల ప్రజలను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేశాయి . ఈ గంజాయి పట్టుబడ్డ వ్యవహారంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మొక్కలు నాటి.. పర్యావరణాన్ని కాపాడుకుందాం

- **అమ్డాపూర్ లో ఘనంగా నర్సరీ మొక్కల పంపిణీ**
- **సర్పంచ్ మద్యాపాగ కృష్ణ, సెక్రెటరీ కవితా రెడ్డి పిలుపు**

**మొయినాబాద్, జులై 25(ప్రజాక్షేత్రం):**

గ్రామాలను పచ్చదనంతో నింపి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అమ్డాపూర్ గ్రామ సర్పంచ్ మద్యాపాలు కృష్ణ, పంచాయతీ కార్యదర్శి (సెక్రెటరీ) కవితా రెడ్డి పిలుపునిచ్చారు. మొయినాబాద్ మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో రైతులకు, గ్రామ ప్రజలకు ఉచితంగా నర్సరీ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వాతావరణ సమతుల్యత కాపాడటంతో పాటు రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి చెట్లే ఆధారమని పేర్కొన్నారు. పంచాయతీ ద్వారా పంపిణీ చేసిన ప్రతీ మొక్కనూ రైతులు, ప్రజలు బాధ్యతాయుతంగా నాటి ఎదిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తూర్పు జితేందర్ రెడ్డి, గ్రామ కారాబార్ గోపాల్ చారి, ప్రముఖ రైతు నోముల సిద్ధి రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# ఎల్‌నినోకు చెక్..

- **ప్రత్యామ్నాయ పంటలే మేలు**
- **వరికి బదులు పప్పు, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలు సాగు చేయాలి**
- **జయన్న తిరుమలాపూర్ గ్రామసభలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు**
- **డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**

**వనపర్తి,జూలై 25 (ప్రజాక్షేత్రం):**

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ఎల్‌నినో నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సూచించారు. శనివారం గోపాల్ పేట మండలం జయన్న తిరుమలాపూర్ గ్రామంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నిర్వహించిన గ్రామసభలో ఆయన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి పాల్గొని మాట్లాడారు.

రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తే నష్టాలను తగ్గించుకోవడంతో పాటు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సూచనల మేరకు వరికి బదులుగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వర్షపు నీటిని సంరక్షించేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి నీటిని ఒడిసి పట్టే చర్యలు చేపట్టాలని అన్నారు.

కరువు పరిస్థితుల దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను ఏడాది పొడవునా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విన్నవించినట్లు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఉపాధి హామీ పనుల కొనసాగింపునకు కృషి చేస్తామని చెప్పినట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.




**ప్రతి నీటి బొట్టును కాపాడాలి: కలెక్టర్**

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టు అమూల్యమైందని, నీటి సంరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఇంకుడు గుంతల నిర్మాణం, భూగర్భ జలాల పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చి నీటి వనరులను పెంపొందించాలని సూచించారు. వరికి బదులుగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని, రైతులకు అవసరమైన సమాచారం, సాంకేతిక సూచనల కోసం జిల్లా అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, న్యాయవాది ఎండి నిరంజన్ బాబా,గ్రామ పెద్దలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



## ఎన్నికల జాబితా కచ్చితత్వమే ప్రజాస్వామ్యానికి బలం

- **వల్లబ్ నగర్ 137వ బూత్‌లో ఎస్ఐఆర్ గణన ఫారాల నమోదు పూర్తి చేసిన రిటైర్డ్ అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు**
- **మిగిలిన కుటుంబాలు కూడా వెంటనే వివరాలు నమోదు చేయాలని**
- **బీఆర్ఎస్ బీఎల్ఏ తిరుమల్ విజ్ఞప్తి**

**వనపర్తి,జూలై 25 (ప్రజాక్షేత్రం):**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని వల్లబ్ నగర్ 137వ పోలింగ్ బూత్ పరిధిలో శనివారం ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు తన నివాసంలో కుటుంబ సభ్యుల సమగ్ర వివరాలను పరిశీలించి, నిర్దేశిత గణాంకాలను పూర్తి స్థాయిలో నమోదు చేసి సంబంధిత బీఎల్ఓ హెల్పర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏ, మాజీ కౌన్సిలర్ ఉంగ్లం తిరుమల్, బీఎల్ఏ సింగనమోని రాజు మాట్లాడుతూ, ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు ప్రతి కుటుంబం ఎస్ఐఆర్ ఫారాలను సకాలంలో నింపి అందజేయాలని కోరారు. వార్డులో ఇంకా మిగిలి ఉన్న కుటుంబాలు ఆలస్యం చేయకుండా తమ వివరాలను నమోదు చేసి బీఎల్ఓలకు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదవడం ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఎంతో కీలకమని, ప్రజలంతా బాధ్యతగా సహకరించి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు,కార్యకర్తలు, బూత్ స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.




## ఓటు నమోదే ప్రజాస్వామ్యానికి రక్షాకవచం

- **ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండాలి**
- **నిరంజన్ రెడ్డి**
- **తొలి ఏకాదశి సందర్భంగా కోటిలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు**

**వనపర్తి,జూలై 25 (ప్రజాక్షేత్రం):**

ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వనపర్తి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలతో పాటు పెద్దమందడి మండలంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నమోదు ప్రక్రియ పురోగతిని తెలుసుకుని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా వెలుపల ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా ఎంతో అవసరమని ఆయన అన్నారు. ప్రత్యేక సవరణ ప్రక్రియకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో బీఎల్ఓలు, బీఎల్ఏలు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హుడి పేరు తుది జాబితాలో ఉండేలా కృషి చేయాలని కోరారు. వనపర్తి పట్టణంలో 63,246 మంది ఓటర్లు ఉండగా ఇప్పటివరకు 67 శాతం మంది మాత్రమే ఆన్‌లైన్ నమోదు పూర్తి చేసినట్లు పేర్కొంటూ, మిగిలిన వారందరూ వెంటనే నమోదు పూర్తి చేసి వనపర్తిని వంద శాతం ఓటరు నమోదు సాధించిన ఆదర్శ పట్టణంగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం తొలి ఏకాదశి సందర్భంగా కానాయపల్లి కోటిలింగేశ్వర స్వామి ఆలయాన్ని నిరంజన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించిన ఆయన, తొలి ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దేముల్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీకి మరమ్మత్తులు

- **మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ సమస్యకు చెక్!**
- **మిషన్ భగీరథ అధికారుల స్పందన**
- **ప్రధాన చౌరస్తాలో పూర్తి చేసిన మరమ్మతు పనులు**
- **ప్రజల్లో హర్షం.. అధికారులకు కృతజ్ఞతలు**

**పెద్దేముల్,జూలై 25 (ప్రజాక్షేత్రం):**



వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా నుంచి పెద్దేముల్ తండా గ్రామానికి వెళ్లే రహదారి మార్గంలో గత మూడు రోజులుగా మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా పోతుండేది.ఈ సమస్యతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతుండగా, విలువైన తాగునీరు నిరంతరం వృథా కావడంపై స్థానికులు, కాలానీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ విషయాన్ని పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై.నర్సింహులు మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వెంటనే లీకేజీని సరిచేయాలని కోరారు.సర్పంచ్ విజ్ఞప్తికి స్పందించిన మిషన్ భగీరథ అధికారులు శనివారం లీకేజీ ప్రాంతంలో మరమ్మతు పనులు చేపట్టి పైప్‌లైన్‌ను సరిచేశారు.మిషన్ భగీరథ సూపర్‌వైజర్ శ్రీనివాస్ ప్రత్యేకంగా చొరవ చూపి మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీకి దగ్గరుండి మరమ్మత్తులు చేయించారు.దీంతో మూడు రోజులుగా కొనసాగుతున్న నీటి వృథాకు అడ్డుకట్ట పడింది.సమస్య పరిష్కారం కావడంతో చౌరస్తా పరిసర ప్రాంతాల ప్రజలు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ మిషన్ భగీరథ అధికారులకు, సమస్య పరిష్కారానికి కృషి చేసిన గ్రామ సర్పంచ్ డివై.నర్సింహులకు కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో ఇలాంటి లీకేజీలు తలెత్తిన వెంటనే అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

## నరసాపురంపాఠశాలను సందర్శించిన శాసనసభ్యులు మరియు ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్

**భద్రాచలం,జూలై25:(ప్రజాక్షేత్రం):**

భద్రాచలం శాసనసభ సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు మరియు భద్రాచలం ఐ.టి.డి.ఏ. ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ శనివారం నాడు నరసాపురం గ్రామంలోని సూది రెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించడం జరిగింది. పాఠశాలలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పూజారి రత్నకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు అతిథులను ఆహ్వానించడం జరిగింది. పాఠశాల వసతులను గూర్చి గౌరవ శాసనసభ్యులు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలో బాలురకు మూత్రశాలలు మరియు మరుగుదొడ్ల మరమ్మత్తులు చేయించవలసిన అవసరాన్ని తెలియజేశారు. పాఠశాలలో త్రాగునీటి కొరత అధికంగా ఉందని ప్రతినెల 4000 రూపాయలు ఖర్చు పెడుతున్నామని , గ్రామంలోని మిషన్ భగీరథ గ్రిడ్ నుండి డైరెక్ట్ గా పాఠశాలకు కనెక్షన్ ఇప్పించ వలసినదిగా మరియు ఒక బోర్ ని కూడా పాఠశాలలో ఏర్పాటు చేయవలసినదిగా గౌరవ ఎమ్మెల్యే గారిని కోరడం జరిగినది. పై సమస్యల పట్ల ఎమ్మెల్యే గారు సానుకూలంగా స్పందించడం జరిగినది. అనంతరం పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పూజారి రత్నకుమారి ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు పాఠశాలకు విచ్చేసిన భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు ను మరియు ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ రాహుల్ లకు పూల గుచ్చాలు అందించి ఘనంగా శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొనడం జరిగినది.



## ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో నేను ఓట్లు అడగను ఎమ్మెల్యే జిఎంఆర్

**మహబూబ్ నగర్ జూలై 25(ప్రజాక్షేత్రం):**



ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో తాను ఓట్లు అడగనని, బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు ఎక్కడ ఇచ్చిందో అక్కడే ఆ పార్టీ నాయకులు ఓట్లు అడగాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సవాల్ విసిరారు. దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో తాను ఓట్లు అడగనని, బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు ఎక్కడ ఇచ్చిందో అక్కడే ఆ పార్టీ నాయకులు ఓట్లు అడగాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సవాల్ విసిరారు. శనివారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని, అవసరమైన ప్రతి అర్హ కుటుంబానికి ఇళ్లు అందించే వరకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఇళ్లు నిర్మించి ఓట్లు అడిగే నైతిక అర్హత కాంగ్రెస్కే ఉందని, బీఆర్ఎస్కు లేదని విమర్శించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్నామని, పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ వంటి అవకాశాలను మండల మహిళా సమాఖ్యలకు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం పేదలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా సంక్షేమం కంటే అవినీతి,దోపిడీకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని, ప్రజల ఆదరణతో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లవి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు బోయేజ్, అఖిల సుభాష్, సుధా రామ్మోహన్ రెడ్డి, సంజీవులు, మురళి యాదవ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నరసాపురంపాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే మరియు ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్

- **త్రాగునీటి సరపర కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి**

**జూలై 25 ప్రజాక్షేత్రం దుమ్ముగూడెం**



భద్రాచలం శాసనసభ సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు మరియు భద్రాచలం ఐ.టి.డి.ఏ. ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ శనివారం నాడు నరసాపురం గ్రామంలోని సూది రెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పూజారి రత్నకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు అతిథులను ఆహ్వానించడం జరిగింది. పాఠశాల వసతులను గూర్చి శాసనసభ్యులు వెంకట్రావు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలో బాలురకు మూత్రశాలలు మరియు మరుగుదొడ్ల మరమ్మత్తులు చేయించవలసిన అవసరం ఉందని పాఠశాలలో త్రాగునీటి కొరత అధికంగా ఉందని ప్రతినెల 4000 రూపాయలు ఖర్చు పెడుతున్నామని , గ్రామంలోని మిషన్ భగీరథ గ్రిడ్ నుండి డైరెక్ట్ గా పాఠశాలకు కనెక్షన్ ఇప్పించ వలసినదిగా మరియు ఒక బోర్ ని కూడా పాఠశాలలో ఏర్పాటు చేయ వలసినదిగా ఎమ్మెల్యేనీ కోరడం జరిగినది. పై సమస్యల పట్ల ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అనంతరం పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పూజారి రత్నకుమారి ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు పాఠశాలకు విచ్చేసిన భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు ను మరియు ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ రాహుల్లకు పుష్ప గుచ్చాలు అందించి ఘనంగా శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొనడం జరిగినది.



## రామాలయంకు రూ.4 లక్షల విరాళం

**భద్రాచలం, జూలై 24 ప్రజాక్షేత్రం**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంకు శనివారం రూ.4 లక్షలు విరాళంను హైదరాబాద్కు చెందిన మల్లేశ్వరి వరప్రసాద్ దంపతులు అందజేశారు. దేవస్థానం నిత్యన్నదాన పథకంకు రూ.3 లక్షలు, గోశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ విరాళంను ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా అందజేశారు.



# వికారాబాద్‌లోనే వైద్యం.. హైదరాబాద్‌కు పరుగెందుకు?

- **జీ జి ఎచ్ ను అన్ని రకాల వైద్య సేవలకు కేంద్రంగా తీర్చిదిద్దాలి: స్పీకర్ ప్రసాద్ కుమార్**
- **330 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి..**
- **త్వరలో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ | డాక్టర్లు, సిబ్బంది సేవాభావంతో పనిచేయాలి**
- **అంబులెన్స్‌లు నిమిషాల్లో బయలుదేరేలా చర్యలు**

**వికారాబాద్ జులై 25(ప్రజాక్షేత్రం):**




వికారాబాద్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డ ప్రసాద్ కుమార్ తెలిపారు. వికారాబాద్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జీ జి ఎచ్ అభివృద్ధి సొసైటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. ఒక్కో మెడికల్ విద్యార్థి విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.70 లక్షలు ఖర్చు చేస్తోందని, రిక్రూట్‌మెంట్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలను కూడా కల్పిస్తోందన్నారు. ప్రభుత్వం ఇంత చేస్తున్న నేపథ్యంలో వైద్యులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

హెచ్ఓడీలు హైదరాబాద్ నుంచి ప్రతిరోజూ వచ్చి వెళ్లకుండా స్థానికంగా ఉంటే మరింత సమయం వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. వికారాబాద్‌లోనే మెడికల్ కాలేజీ అందుబాటులో ఉన్నందున కాలేజీ అధ్యాపకులతో పాటు ఆసుపత్రి హెచ్ఓడీలు కూడా తమ అనుభవాలను వైద్య విద్యార్థులకు బోధించాలని సూచించారు.

గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం కారణంగా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయలేకపోతున్నామని, అయినప్పటికీ అందుబాటులో ఉన్న నిధుల మేరకు వికారాబాద్ ఆసుపత్రికి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రులకు ఎక్కువగా పేద ప్రజలే వస్తారని, వికారాబాద్ చుట్టూ అనేక గ్రామాలు ఉన్నందున స్థానికంగా మెరుగైన వైద్యం అందుబాటులో లేకపోతే హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. పెద్ద జబ్బులకు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తే పేదలు భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని, కొన్నిసార్లు ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల పరీక్షలు, చికిత్సలు, ఆపరేషన్లు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలు, మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వం వందల, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి భవనాలు, పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు, ఇతర సౌకర్యాలు కల్పించినప్పటికీ.. వైద్యులు, సిబ్బంది నాణ్యమైన వైద్యం అందించి రోగులను ఆరోగ్యంగా ఇంటికి పంపించినప్పుడే ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు.

"మౌలిక వసతులు కల్పించడం మా బాధ్యత.. మంచి చికిత్స అందించడం మీ బాధ్యత" అని వైద్యులు, సిబ్బందికి స్పీకర్ సూచించారు.

వికారాబాద్ మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న 100 పడకల ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌ను రూ.30 కోట్లతో 330 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. త్వరలో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ కూడా అందుబాటులోకి రానుందని చెప్పారు. వైద్య విద్యార్థులు కూడా అందుబాటులో ఉండటంతో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు.

మెరుగైన వైద్యం కోసం ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోనే అన్ని రకాల వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' అత్యంత కీలకమని స్పీకర్ తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి మొదటి గంటలోనే మెరుగైన వైద్యం అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని అన్నారు. అందువల్ల వైద్యులు, సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆసుపత్రి అంబులెన్స్‌లు ఎల్లప్పుడూ పని చేసే స్థితిలో ఉండాలని, అత్యవసర సమాచారం అందిన వెంటనే నిమిషాల్లో బయలుదేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. "మన ఆసుపత్రికి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తాను. నేను కోరేది ఒక్కటే.. రోగులు హాస్పిటల్‌కు బాధతో రావాలి.. తిరిగి వెళ్లేటప్పుడు నవ్వుతూ వెళ్లాలి. ఆ విధంగా ప్రతి ఒక్కరూ సేవలు అందించాలి" అని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. ఈ సమావేశంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డి ఏం ఎచ్ ఓ సుధాకర్ లాల్, సూపరింటెండెంట్ సుభోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహా రెడ్డితో పాటు అభివృద్ధి సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య ఊపిరి - కాక్రోచ్ జనతా పార్టీ

పేరుకే అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశంగా వర్ధిల్లుతున్న ఈ భారతదేశంలో పాలకులు అప్రజాస్వామికంగా ఈ వ్యవహరిస్తున్న ఘటనలు అనేకంగా చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ముఖ్యంగా వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి నైతిక బాధ్యత వహిస్తూ 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి' అంటూ కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో 2026 జూన్ 21 నాడు ప్రారంభమై నెల రోజులకు పైగా నిరవధిక నిరసనలు కొనసాగిస్తున్న తరుణంలో ఎట్టకేలకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం శుభపరిణామం. ముఖ్యంగా ప్రజాస్వామికంగా వ్యవహరించాల్సిన పాలకులు పౌరులు నినదించకముందే సిగ్గుతో తలదించుకొని స్వచ్ఛందంగా దిగిపోవాల్సిన అవసరం ఉన్ననూ వారు ఆ విధంగా వైదొలగిపోవడం లేదు. ముఖ్యంగా చెప్పాలంటే నిజానికి నీట్ పేపర్ లీక్ అయినప్పుడే 'నైతిక బాధ్యత'గా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి ఉండాల్సింది. కాని ఆయన యువతరం ఆందోళనలకు తలొగ్గి ఆలస్యంగా అయిననూ అంతిమంగా రాజీనామా చేయడం తద్వారా 'యువతరం గెలిచి నిలవడమే కాకుండా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ప్రజాస్వామ్యానికి ఊపిరిపోసింది' అని చెప్పవచ్చు. ఈ గెలుపు ప్రజాస్వామిక రాజకీయాలలో సరికొత్త దశ దిశను నిర్దేశించింది' అని చెప్పడంలో ఏమాత్రం ఔచిత్యం లేదు.

'కాక్రోచ్ జనతా పార్టీ (సి.జె.పి) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే నేతృత్వంలో యువతరం విద్యార్థుల సమష్టి పోరాటాలు మరియు ప్రముఖ పర్యావరణవేత్త సోనమ్ వాంగ్ చుక్ త్యాగం ఫలితంగానే మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు' అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ముఖ్యంగా సోనమ్ వాంగ్ చుక్ 'దీక్షని విరమించండి' అని పౌర సమాజం కోరిననూ, అలాగే పోలీసులు భగ్నం చేసిననూ కుడా ఆయన ఏమాత్రం వెనకడుగు వేయకుండా ఆసుపత్రి నుండి కూడా దీక్షని కొనసాగించి మొత్తంగా ఇరవై ఆరు రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షని కొనసాగించడం ఈ ఉద్యమంలో మైలురాయిగా నిలిచిపోయింది. సోనమ్ వాంగ్ చుక్ దీక్ష భగ్నం అనంతరం జంతర్ మంతర్ లో శాంతియుతంగా దీక్షను కొనసాగిస్తున్న అభిజిత్ దీప్కే సైతం ఒక మహిళ చేత ఏకంగా సిరా దాడికి గురి కాబడిననూ ఆయన ఏమాత్రం బెదరకుండా 'నీలం నా రంగు ... జై భీమ్' అంటూ ముందుకు సాగి పోరాటాన్ని కొనసాగించడాన్ని యువతరం ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం తప్పకుండా ఉంది. పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో ఆందోళనకారులు లాఠీచార్జీ సహా అనేక పోలీసు దాష్టీకాలను అధిగమించి పోరాటాన్ని ముందుకు సాగించడం గొప్ప ముందడుగుగా నిలిచింది.

కేంద్ర ప్రభుత్వం ఆందోళనకారులపై అనేక విష ప్రచారాలు వ్యాప్తి చేసిననూ వాటన్నింటిని అధిగమించి ప్రజాస్వామిక బాటలో ఉద్యమిస్తుండడం భావి తరాలకు మార్గదర్శిగా నిలుస్తుంది. ఇకనైననూ ఆయా ప్రభుత్వాలు ప్రజా ఆందోళనలను అణచివేయడం పైననే దృష్టిని కేంద్రీకరించకుండా 'ఆందోళనకారుల డిమాండ్లను పరిష్కరిద్దాం' అనే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం తప్పకుండా ఉంది. కాక్రోచ్ జనతా పార్టీ లేవనెత్తిన అన్ని డిమాండ్లను పరిష్కరించేంతవరకు యువతరంతో పాటు ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు మరింతగా ఉద్యమించాల్సిన అవసరం తప్పకుండా ఉంది. ఈ సందర్భంగా 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి' అంటూ ఉద్యమించి గెలిచి నిలిచిన 'యువతరానికి జేజేలు' తెలియజేస్తున్నాను.



**జె.జె.సి.పి. బాబూరావు**
**రీసెర్చ్ స్కాలర్**
**సెల్: 94933 19690**

# ఇది విద్యార్థుల విజయం.. ప్రజాస్వామ్యానికి దక్కిన గౌరవం

- **- కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)**
- **- నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడంపై సీజేపీ హర్షం**
- **శాంతియుత నిరసనల ద్వారానే విద్యార్థి లోకం.**
- **ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధించిందన్న సీజేపీ అభిజీత్ దీప్కే.**
- **మిగిలిన డిమాండ్లు నెరవేరేవరకు విద్యావ్యవస్థ ప్రక్షాళన కోసం పోరాటం.**

**న్యూఢిల్లీ జులై 25(ప్రజాక్షేత్రం):**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ పేపర్ లీకేజీ వివాదంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) స్పందించింది. "ఇది పూర్తిగా దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల విజయం" అంటూ పార్టీ తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో హర్షం వ్యక్తం చేసింది. మంత్రి రాజీనామా వార్త వెలువడటంతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు.

**గాంధీజీ మార్గంలో నడిచాం.. ఫలితం దక్కింది**

ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. "మనం శాంతియుత మార్గంలో చేసే ఏ ఆందోళన అయినా సరే, లక్ష్యాన్ని తప్పకుండా ముద్దాడుతుందని నేను మహాత్మా గాంధీజీని చూసి నేర్చుకున్నాను. ఈ దేశ యువత చేసిన శాంతియుత నిరసనలు, త్యాగాలు వృథా కాలేదు. విద్యార్థుల సుదీర్ఘ పోరాటం ఈరోజు ఫలించింది, వారి సత్తా ఏంటో ప్రభుత్వానికి తెలిసొచ్చింది. ఈ విజయం విద్యార్థులందరిది.. అసలైన ప్రజాస్వామ్యం అంటే ఇదే" అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

**మిగతా డిమాండ్లు నెరవేరేవరకు విశ్రమించం**

ప్రధాన్ రాజీనామాతో తమ ప్రధాన డిమాండ్లలో ఒకటి నెరవేరినప్పటికీ, ఉద్యమం ఇప్పుడే ఆగిపోదని సీజేపీ నేతలు స్పష్టం చేశారు. "మాకు ఎలాంటి రాజకీయాలు అవసరం లేదు. జంతర్ మంతర్ వద్ద నిరసన చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేసిన పోలీసులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి. అలాగే నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులను ప్రభుత్వం బేషరతుగా ఎత్తివేయాలి. దేశంలో విద్యావ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసే వరకు మా పోరాటం ఆగదు" అని వారు పిలుపునిచ్చారు. ఈ విజయానికి గుర్తుగా శనివారం సాయంత్రం 6:30 గంటలకు జంతర్ మంతర్ పరిసరాల్లో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ ప్రకటించింది.



**ఎవరీ అభిజీత్ దీప్కే?**

దేశ విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను, అక్రమాలను ఎత్తిచూపుతూ కేవలం రెండు నెలల క్రితమే 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆవిర్భవించింది. మహారాష్ట్రలోని పుణెలో జర్నలిజం పూర్తి చేసి, అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ రిలేషన్స్‌లో మాస్టర్స్ చేసిన 30 ఏళ్ల అభిజీత్ దీప్కే ఈ పార్టీని స్థాపించారు. స్థాపించిన కొద్ది గంటల్లోనే సామాజిక మాధ్యమాల్లో ఈ పార్టీ పేరు మారుమోగిపోయింది. నీట్ అక్రమాలకు బాధ్యత వహిస్తూ మంత్రి రాజీనామా చేయాలంటూ దీప్కే నేతృత్వంలో జంతర్ మంతర్ వద్ద ప్రారంభమైన దీక్షకు దేశవ్యాప్తంగా విద్యార్థులు, వివిధ రంగాల ప్రముఖులు భారీగా మద్దతు పలికారు. జులై 20న నిర్వహించిన 'చలో పార్లమెంట్' మార్చ్‌తో ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి రావడంతో ఎట్టకేలకు కేంద్రం దిగిరాక తప్పలేదు.

# మంచి పాత్రలకు తమిళ పరిశ్రమ సరైన చోటు




సినిమాల్లో అవకాశాల కోసం తొందరపడడం లేదని నటి నిధి అగర్వాల్ (Nidhhi Agerwal) అన్నారు. 'ఈశ్వరన్', 'భూమి', 'కళగ తలైవన్' తర్వాత తమిళ సినిమా చేయలేదని, సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పారు.

"మంచి దర్శకులతో అర్థవంతమైన పాత్రలు ఉన్న సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాంటి పాత్రలకు తమిళ ఇండస్ట్రీ సరైన చోటు. నా జీవితంలో దేనికీ నేను తొందరపడను. పెళ్లి విషయంలో కూడా అంతే. మంచి ప్రాజెక్ట్‌లు వస్తే.. సినిమాలు చేస్తాను. 'హరి హర వీరమల్లు' (Hari Hara Veera Mallu), 'ది రాజా సాబ్' (The Raja Saab) సినిమాల్లో స్టార్‌లతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. ప్రస్తుతం తెలుగు, హిందీ సినిమాలతో బిజీగా ఉన్నాను. దీంతో తమిళంలో నటించడం మిస్ అవుతున్నా. నాది చాలా సున్నితమైన మనస్తత్వం. అందుకే భావోద్వేగాలు ఎక్కువగా బయటపెట్టను. వృత్తిపరంగా బాగా కష్టపడతాను. ఇతర విషయాలకొస్తే అత్యంత సోమరిని. ప్రస్తుతం రెండు ప్రాజెక్టుల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఇంకా ఫైనల్ చేయలేదు " అని నిధి తెలిపారు.

ఇక, ప్రస్తుతం ఆమె 'మిరాయ్' పార్ట్-2, హిందీ సైకలాజికల్ థ్రిల్లర్ 'ది ఇన్‌ఫ్లుయెన్సర్'లో కనిపించనున్నారు.

# ఆయనతో కలిసి పనిచేయడంతో నా కల నెరవేరినట్లే..

స్టార్ హీరోలతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లు తెరకెక్కిస్తూ వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు లోకేష్ కనగరాజ్, ఇప్పుడు హీరోగా మారి అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన హీరోగా నటించిన లేటెస్ట్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'డీసీ'. 'కెప్టెన్ మిల్లర్' చిత్రంతో ప్రశంసలు అందుకున్న అరుణ్ మాతేశ్వరన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. బాలీవుడ్ నటి వామికా గబ్బి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. ఈ సినిమా జూలై 31న థియేటర్లలోకి రాబోతోంది. సినిమా విడుదల దగ్గర పడుతుండటంతో మేకర్స్ ఇటీవల గ్రాండ్‌గా ఆడియో లాంచ్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హీరోయిన్ వామికా గబ్బి, లోకేష్ కనగరాజ్‌తో పనిచేసిన అనుభవాన్ని పంచుకుంటూ ఎమోషనల్ కామెంట్స్ చేశారు. వామికా మాట్లాడుతూ... సెట్స్‌లో లోకేష్ చూపించే డెడికేషన్ చూసి తాను ఆశ్చర్యపోయానని తెలిపారు. దర్శకుడిగా ఆయన ప్రతిభ అందరికీ తెలిసిందేనని, కానీ నటుడిగా ఆయనలోని నూతన కోణాన్ని చూసి తాను మరింత ముగ్ధురాలినయ్యానని అన్నారు. ఒక వైపు డైరెక్షన్‌ను, మరోవైపు యాక్టింగ్‌ను ఆయన హ్యాండిల్ చేసిన విధానం అద్భుతమని ప్రశంసించారు. బహుశా భవిష్యత్తులో ఆయన తన సినిమాలకు సంగీతం కూడా అందిస్తారేమోనని చెప్పారు. అలాగే లోకేష్‌ను ఒక మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్‌గా, రియల్ రాక్‌స్టార్‌గా అభివర్ణించారు. లక్షలాది మంది ప్రేక్షకులు ఆయన తెరకెక్కించిన సినిమాల్లోని పాటలకు స్టెప్పులేశారని, అంతటి గుర్తింపు పొందిన టాలెంటెడ్ పర్సన్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం తన అదృష్టమని, తనకల నెరవేరిందని చెప్పారు. వామికా చేసిన ఈ ఆసక్తికరమైన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.





# సినిమా ఫలితంతో నా ప్రతిభను అంచనా వేసుకోను

బాలీవుడ్ భామ త్రిప్తి దిమ్రి (Triptii Dimri) తనదైన నటనతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ చిత్రం 'యానిమల్' (Animal)తో దేశవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్నారు. ఈ క్రమంలో స్టార్‌డమ్, హిట్లు, ఫ్లాప్‌ల గురించి త్రిప్తి తాజాగా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

" 'యానిమల్' విజయం నాకు ఎంతో స్వేచ్ఛనిచ్చింది. ఆ సినిమాకి ముందు నాలోని ప్రతిభను నిరూపించుకునే అవకాశాల కోసం నిరంతరం ఎదురుచూసేదాన్ని. ఆ తర్వాత ఇండస్ట్రీలో నాపై నమ్మకం పెరిగింది. ఎన్నో ప్రాజెక్టులు వస్తున్నాయి. ఇప్పుడు కేవలం నిలదొక్కుకోవాలనే భయంతో కాకుండా.. నాకు నచ్చిన కథలను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ చిత్ర పరిశ్రమలో దొరికింది. మొదట్లో ఈ స్టార్‌డమ్ కాస్త ఇబ్బందిగా అనిపించినా, తర్వాత అలవాటు పడ్డాను. నేను ఎప్పుడూ నా పనిపైనే పూర్తి దృష్టి పెడతాను. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రాకపోవడం కూడా నాకు కలిసొచ్చింది. ఎందుకంటే.. అది నన్ను ఎప్పుడూ ఒదిగి ఉండేలా చేస్తుంది" అని అన్నారు.

ఇక, త్రిప్తి, షాహిద్ కపూర్ జంటగా విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఇటీవల వచ్చిన చిత్రం 'ఓ రోమియో'. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయం సాధించలేదు. దీనిపై ఆమె స్పందిస్తూ.." కమర్షియల్‌గా సినిమా పరాజయం పాలై ఉండొచ్చు. కానీ, నేను దాన్ని వ్యక్తిగత వైఫల్యంగా భావించను. నటీనటులంతా తమ పాత్రలకు ప్రాణం పెట్టి నటిస్తారు. ప్రేక్షకులు దానికి కనెక్ట్ అవ్వాలని కోరుకుంటారు. కానీ, అన్నిసార్లు అనుకున్నట్లు జరగదు. కొన్నిసార్లు సమయం, అంచనాల వల్ల ఫలితం దక్కుతుంది. కొన్ని చిత్రాలకు ఆలస్యంగా గుర్తింపు వస్తుంది. ఈ సినిమా నాకు ఎన్నో విషయాలు నేర్పించింది. మూవీ ఫలితాన్ని బట్టి మన విలువను, ప్రతిభను అంచనా వేసుకోకూడదనే విషయాన్ని ఈ చిత్రం ద్వారానే నేర్చుకున్నాను. పాత్రకు వంద శాతం న్యాయం చేసి, ఫలితాన్ని వదిలేయాలి " అని పేర్కొన్నారు.

# నారా రోహిత్.. 'కపాలి'

కథానాయకుడు నారా రోహిత్ కొత్త కబురు వినిపించారు. రామ్ గన్నీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. కల్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప్ నిర్మిస్తున్నారు. విజయ్ కృష్ణ లింగమనేని సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి 'కపాలి' అనే పేరును ఖరారు చేశారు. ఈరోజు నారా రోహిత్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఈ చిత్ర టైటిల్ లుక్‌ని విడుదల చేశారు. పురాణాంశాలతో నిండిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ ఇది. రోహిత్ ఇందులో పోలీసు పాత్రలో అలరించనున్నారు. టైటిల్ పోస్టర్‌లో ఆయన ఓ చీకటి శక్తితో పోరాడుతున్నట్లు ఆసక్తికరంగా కనిపించారు. ఇందులో ఆయనకు జోడీగా హన్సిక నటిస్తోంది. ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.



# స్క్రీన్‌పై నన్ను నేను చూసుకుంటే చాలా అసహ్యమేసింది..




అక్కినేని అఖిల్ 2023లో నటించిన 'ఏజెంట్' సినిమా బాక్సాఫీసు వద్ద భారీ డిజాస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో సాక్షి వైద్య హీరోయిన్‌గా నటించగా.. మమ్ముట్టి కీలక పాత్రలో కనిపించారు. అయితే ఈ సినిమా భారీ అంచనాల మధ్య వచ్చి ఆశించినంత స్థాయిలో మెప్పించలేకపోయింది. దీంతో దాదాపు మూడేళ్ల పాటు విరామం తీసుకున్న అఖిల్, ఇటీవలే 'లెనిన్' చిత్రంతో గ్రాండ్ సక్సెస్ సాధించి మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అఖిల్ 'ఏజెంట్' ఫ్లాప్‌పై స్పందిస్తూ షాకింగ్ కామెంట్స్ చేశారు. సినిమా డిజాస్టర్ అయిన తర్వాత తాను ఆ చిత్రాన్ని మళ్లీ చూశానని, వెండితెరపై తనను తాను చూసుకున్నప్పుడు తీవ్ర అసహ్యం వేసిందని అఖిల్ నిజాయితీగా అంగీకరించారు. దాదాపు ప్రతి సన్నివేశంలోనూ అతిగా ఓవరాక్టింగ్ చేసినట్లు తనకు స్పష్టంగా అనిపించిందని వెల్లడించారు. అయితే విడుదల కంటే ముందే ఫస్ట్ కాపీ చూసుకున్న సమయంలోనే ప్రాజెక్ట్‌లో ఏదో తేడా కొట్టిందని గ్రహించానని అఖిల్ తెలిపారు. ఆ విషయాన్ని తన ఫ్రెండ్స్, క్లోజ్ సర్కిల్స్‌లోని కొందరికి చెప్పినప్పటికీ, భారీ బడ్జెట్ కారణంగా ఎవరూ దాన్ని పట్టించుకోలేదని అన్నారు. ఒక కథానాయకుడిగా ఆ నిర్మాత పెట్టిన కోట్ల రూపాయల పెట్టుబడిని వీలైనంత వరకు రికవరీ చేయడానికి సినిమాకు సపోర్ట్ ఇవ్వాల్సి వచ్చిందని, అందుకే దాన్ని ప్రమోట్ చేశానని స్పష్టం చేశారు.

# 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాలో బిగ్గెస్ట్ సర్‌ప్రైజ్..

టాలెంటెడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి ప్రస్తుతం సూర్య హీరోగా, మమిత బైజు హీరోయిన్‌గా తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో అనిల్ కపూర్, రాధికా శరత్ కుమార్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం కానుకగా ఆగస్టు 14న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇదివరకే ప్రకటించారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ల వేగం పెంచింది. వరుస అప్‌డేట్‌లతో ప్రేక్షకులు, అభిమానుల్లో అంచనాలను పెంచేస్తోంది. ఈ క్రమంలోనే ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు వెంకీ అట్లూరి ఈ సినిమాకి సంబంధించి ఒక బిగ్గెస్ట్ సర్ ప్రైజ్ విషయాన్ని వెల్లడించారు. ఈ సినిమాలో సూర్య నిజ జీవిత భాగస్వామి, కోలీవుడ్ స్టార్ నటి జ్యోతిక ఒక పవర్ ఫుల్ కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. చాలా కాలం తర్వాత సూర్య, జ్యోతిక రీల్ లైఫ్‌లోనూ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల ఆనందానికి హద్దులు లేవు. వెంకీ అట్లూరి రివీల్ చేసిన ఈ మైండ్ బ్లోయింగ్ న్యూస్‌తో 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి.



# తొలి హీరోగా విజయ్ హ్యాట్రిక్ రికార్డు..



అగ్ర కథానాయకుడు విజయ్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జన నాయగన్' (Jana Nayagan) బాక్సాఫీస్ వద్ద రికార్డు సృష్టించింది. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ ప్రీసేల్‌లో ఏకంగా 10 లక్షల టికెట్లు అమ్ముడైనట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. దీంతో వరుసగా మూడు సినిమాలకు ప్రీసేల్ బుకింగ్స్‌లోనే వన్ మిలియన్ మార్క్ అందుకున్న తొలి భారతీయ హీరోగా విజయ్ నిలిచారు. గతంలో విజయ్ నటించిన 'వారిసు', 'ది గోట్' చిత్రాలు కూడా విడుదలకు ముందే 10 లక్షలకు పైగా టికెట్ల విక్రయాలతో ఈ ఘనత సాధించగా.. ఇప్పుడు 'జన నాయగన్'తో విజయ్ (Vijay) హ్యాట్రిక్ కొట్టారు.

**'జన నాయగన్' కథంటేంటే..**

దళపతి వెట్రి కొండాన్ (విజయ్) ఓ ఖైదీగా జైలు జీవితాన్ని గడుపుతుంటాడు. ఓ వ్యాపారవేత్తని అంతం చేయడానికి జైలుపై పడిన ముఠాని ఎదురించి నిజాయతీ కలిగిన జైలు అధికారి (గౌతమ్ మేనన్) దృష్టిని ఆకర్షిస్తాడు. ఆ అధికారి సాయంతో ఆగస్టు 15న క్షమాభిక్ష కింద బయటకొస్తాడు వెట్రి. అంతలోనే ఆ అధికారి ఓ ప్రమాదంలో మరణిస్తాడు. దాంతో అతడి కుమార్తె విజ్జి (మమిత బైజు)ని పెంచే బాధ్యతని వెట్రి తన భుజాన వేసుకుంటాడు. చిన్నప్పుడు తల్లి దారుణ హత్యని కళ్లారా చూసిన విజ్జి ప్రతి చిన్న విషయానికీ భయంతో వణికిపోతుంటుంది. ఆమెను ధైర్యవంతురాలిగా మార్చి, సైన్యంలో చేర్పించాలని నిర్ణయించుకుంటాడు. అందుకోసం శిక్షణ కూడా ఇప్పిస్తుంటాడు. ఇంతలో జాన్ హిమ్లర్ (బాబీ డియోల్) విజ్జిని లక్ష్యంగా చేసుకుని ఆమెని అంతం చేయాలని తన ముఠాని పంపుతాడు. ఇంతకీ విజ్జిని జాన్ హిమ్లర్ లక్ష్యంగా చేసుకోవడానికి కారణమేమిటి?అనేది కథ.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394